విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 సంచిక : 267 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ మంగళవారం 17 ఫిబ్రవరి 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



## కిమ్ రాజ్యంలో 'అత్తాకోడళ్ల' పోరు తప్పదా..?

నిరంకుశ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కిమ్ రాజ్యంలో కుటుంబ పోరుకు తెర లేచిందా? అధికార పగ్గాల కోసం అత్తా కోడళ్లు పోటీ పడనున్నారా? ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ఇలాంటి ప్రశ్నలే ఎదురవుతున్నాయి. ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన వారసత్వ పగ్గాలను 13 ఏళ్ల తన కుమార్తె కిమ్ జు యేకు అప్పగించే అవకాశం ఉన్నట్లు ఇటీవల దక్షిణ కొరియా స్పై ఏజెన్సీ వెల్లడించింది. అదే జరిగితే కిమ్ కు తన సోదరి నుంచి సవాలు ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కుమార్తెకు పట్టం..**

కిమ్ జోంగ్ ఉన్ తన రాజకీయ వారసురాలిగా కుమార్తె కిమ్ జు యేను ప్రకటించే అవకాశాలున్నట్లు దక్షిణ కొరియా నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్(ఎన్ఐఎస్) అంచనా వేసింది.

2

# భారత్ శక్తివంతమైన దేశం..

## మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై నెతన్యాహు ప్రశంసలు.. ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి!

**భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా ప్రకటించారు. అమెరికన్ యూదు సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వచ్చే వారం మన దేశానికి ఎవరు వస్తున్నారో తెలుసా ? నరేంద్ర మోదీ వస్తున్నారు" అని ఉత్సాహంగా చెప్పారు.**

**భారత్ పై ప్రశంసలు:**

భారత్, ఇజ్రాయెల్ మధ్య అద్భుతమైన స్నేహం ఉంది. మేము అన్ని రంగాల్లో సహకారం గురించి చర్చించబోతున్నాం. భారతదేశం చిన్న దేశం కాదు, 140 కోట్ల జనాభా ఉన్న దేశం. భారతదేశం ఎంతో శక్తివంతమైనది, ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉన్న దేశం అని నెతన్యాహు అన్నారు.

**ఈ పర్యటన ఎందుకు ప్రత్యేకం:**

ప్రధాని నరేంద్ర మోదీ చివరిసారిగా 2017లో ఇజ్రాయెల్ సందర్శించారు. మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత ఇప్పుడు పర్యటిస్తున్నారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇజ్రాయెల్‌కు వెళ్లడం ఇదే తొలిసారి.

**ఇజ్రాయెల్ టూర్ ఎందుకు:**

రక్షణ రంగం, సైబర్ భద్రత, వ్యవసాయం, ఉగ్రవాద నిర్మూలనపై ఇరు దేశాల మధ్య కీలక చర్చలు జరగనున్నాయి.

2





## వైకాపా హయాంలోని ఇళ్ల పట్టాలపై విచారణ చేయాలి

### స్థలం చూపించకుండానే పట్టాలు ఇచ్చారు

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఎన్నికలకు ముందు వైకాపా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల్లో అసలైనవి ఎన్ని, నకిలీవి ఎన్ని అనే అంశంపై ప్రభుత్వం విచారణ జరపాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు.

2




## 5 ఏళ్లలో ఐటీ, బీపీఓ జాబ్స్ మాయం..!

### బాంబు పేల్చిన వినోద్ ఖోస్లా

ప్రముఖ టెక్ బిలియనీర్, వెంచర్ క్యాపిటలిస్ట్ సన్ మైక్రోసిస్టమ్స్ సహ వ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లా భారతీయ ఐటీ రంగంపై బాంబు పేల్చారు. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా

2




## సాగర తీరంలో నౌకాదళ విన్యాసాలు...

### నేడు విశాఖకు రాష్ట్రపతి ముర్ము

- విశాఖలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ.. హాజరుకానున్న రాష్ట్రపతి ముర్ము
- 70కి పైగా యుద్ధనౌకల ఫ్లీట్‌ను సమీక్షించనున్న సర్వ సైన్యాధ్యక్షురాలు
- ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధనౌక ఈసారి ప్రత్యేక ఆకర్షణ
- ఐఎఫ్ఆర్‌తో పాటు మిలాన్, హిందూ మహాసముద్ర సింపోజియం కూడా
- మూడు ప్రధాన నౌకాదళ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి

2

# చంద్రబాబుతో కలిసి అరటితోటను సందర్శించిన బిల్ గేట్స్

- రాష్ట్రానికి వచ్చిన గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్
- సాగులో ఏఐ వినియోగంపై ప్రత్యక్ష పరిశీలన
- అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఇంత అద్భుతంగా లేదని ప్రశంస
- డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది కీలకపాత్ర
- విపత్తుల నిర్వహణలో టెక్నాలజీ వినియోగం భేషన్న గేట్స్
- ఏపీ డిజిటల్ ప్రయాణాన్ని వివరించిన సీఎం చంద్రబాబు







**డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయి. ఈ విషయంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలకపాత్ర పోషిస్తున్నారు. చంద్రబాబును మొదటిసారి కలిసినప్పుడే ఆయన ఆలోచనల్లో ముందుచూపు ఉందనే విషయాన్ని గ్రహించా. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న ఆశయంతో గేట్స్ ఫౌండేషన్ కార్యక్రమాల్లో ఈ రంగానికి చెందిన ప్రాజెక్టులే ఎక్కువగా పెట్టాం. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉంది.**

అమరావతి, ఫిబ్రవరి 16: ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన ఉండవల్లి లోని అరటి తోటను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో ఏపీ ప్రభుత్వం వినియోగిస్తున్న ఆధునిక టెక్నాలజీని, దాని పనితీరును సీఎం చంద్రబాబు ఆయనకు వివరించారు. టెక్నాలజీ వాడుతున్న రైతులను అభినందించిన సీఎం. బిల్ గేట్స్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని ప్రదర్శించి చూపించారు. అరటి తోటలో డ్రోన్ల సహాయంతో మందులు పిచికారీ చేసే విధానాన్ని బిల్ గేట్స్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, తమ రైతులు సంప్రదాయాలను గౌరవిస్తూనే టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముందున్నారని, ఇది తనకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఈ విషయాన్నే ఇవాళ ఉండవల్లిలో మిస్టర్ గేట్స్ తో పంచుకున్నాం. పంటలు, మార్కెట్ ధరలు, నేల స్వభావం ఆధారంగా కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా రైతులకు కచ్చిత మైన సలహాలు అందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని, సుస్థిర వ్యవసాయ పద్ధతులను కూడా చురుకుగా ప్రోత్సహిస్తున్నాం అని చంద్రబాబు వివరించారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు అక్కడి రైతులను అభినందించారు.

2



## దిల్లీలో ఏవియేషన్ అకాడమీని ప్రారంభించిన మంత్రి లోకేశ్

### సోమవారం దిల్లీలో చార్లీ ఫాక్స్ ట్రాట్ ఏవియేషన్

భారతీయ వైమానిక రంగం అవసరాలకు తగ్గట్టు యువతకు పైలట్ సహా వివిధ కేటగిరీల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటైన ఛార్లీ ఫాక్స్‌ట్రాట్ ఏవియేషన్ అకాడమీని ఏపీ మంత్రి లోకేశ్ సోమవారం ఇక్కడ ప్రారంభించారు. పైలెట్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. 'అట్లాంటా పర్యటన సమయంలో మొదలైన ఆలోచన ఇప్పుడు కార్యరూపం దాల్చింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగానికి ప్రతిభావంతులను అందించే దిశగా వేసిన పెద్ద ముందడుగు ఇది' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం సాయంత్రం దిల్లీ చేరుకున్న ఆయనకు ఎంపీలు కేశినేని శివనాథ్, సానా సతీష్‌బాబు, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా షష్టిపూర్తి వేడుకల్లో పాల్గొన్నారు.





## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

### ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం

2

## ఏఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడం గర్వకారణం

2

### ప్రపంచ దేశాలకు ప్రధాని మోదీ ఆహ్వానం



# ఏపీ మీట్స్ బిల్‌గేట్స్

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో ఆరోగ్య రంగంలో మెరుగైన సేవలు అందించొచ్చని, నిపుణుల వైద్య సేవలు మారుమూల ప్రాంతాలకు కూడా చేర్చవచ్చని గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఏపీలో మాదిరిగా వ్యవసాయంలో ఏఐని ఉపయోగించడంలేదని, టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమని గేట్స్ ప్రశంసించారు. చంద్రబాబు నాడు ఐటీని ప్రమోట్ చేయడం వల్లే టెక్ నిపుణులు చాలామంది హైదరాబాద్ నుంచి వచ్చేవారని వివరించారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్ కంపెనీల్లో పని చేసే ఉద్యోగుల్లో హైదరాబాద్‌వారే ఎక్కువన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమవారం సచివాలయానికి వచ్చిన బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ తదితర మంత్రులు ఘన స్వాగతం పలికారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్‌ను గేట్స్ బృందం పరిశీలించింది. సెంటర్ ప్రత్యేకతను బిల్‌గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం సీఎం ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో బిల్‌గేట్స్ పాల్గొని మాట్లాడారు. పలువురు మంత్రులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

సచివాలయానికి వచ్చిన బిల్‌గేట్స్‌కు ఆర్టీజీఎస్ కార్యకలాపాలను వివరిస్తున్న రియల్ టైమ్ గవర్నెన్స్ విభాగం సంయుక్త కార్యదర్శి మలికా గార్గ్. చిత్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సచివాలయానికి వచ్చిన బిల్‌గేట్స్‌కు స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై ప్రజంటేషన్ ఇస్తూ వివరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, సీఎస్ విజయానంద్, గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు అంకుర్ వోరా, అర్చనా వ్యాస్

**గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ చంద్రబాబు**

'విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థను ఏపీలో ఏర్పాటు చేయడం బాగుంది' అని బిల్‌గేట్స్ ప్రశంసించారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని చెప్పారు.

'మైక్రోసాఫ్ట్ కార్యాలయం హైదరాబాద్‌లో పెట్టాలన్న చంద్రబాబు ప్రతిపాదనలపై మా నిపుణులతో మాట్లాడితే వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ విధంగా మైక్రోసాఫ్ట్ కార్యాలయాన్ని ప్రారంభించాం' అని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అడిగిన ప్రశ్నకు బిల్‌గేట్స్ సమాధానమిచ్చారు.

ఏఐ ద్వారా వైద్య రంగంలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించొచ్చని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏఐ రాకతో ఉద్యోగాలను పునర్ నిర్వచించాల్సిన (రీ డిఫైనింగ్) అవసరం ఉందని ఐఏఎస్ అధికారి బాబు.ఎ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దిల్లీలో నిర్వహిస్తున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఏఐ వల్ల వచ్చే అవకాశాలు, ఎదురయ్యే సవాళ్ల గురించి ప్రపంచంలోని ఏఐ నిపుణులంతా చర్చిస్తారని గేట్స్ వివరించారు.

**2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్‌డీపీగా రాష్ట్రం**

'స్వర్ణాంధ్ర-2047 నాటికి ముఖ్య లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్‌డీపీగా తీర్చిదిద్దనున్నాం. తలసరి ఆదాయం 3,400 డాలర్ల నుంచి 2047 నాటికి 42,000 డాలర్లకు పెంచనున్నాం. ఎగుమతులను 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు తీసుకెళతాం. నిరుద్యోగితను 4.1% నుంచి 2% కన్నా తగ్గించడం, మహిళా కార్మికుల సంఖ్యను 45.8% నుంచి 80 శాతానికి పెంచడం మా లక్ష్యం. 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతానికి తీసుకెళతాం. 95% నైపుణ్యం గల మానవవనరులు ఉండేలా తీర్చిదిద్దుతాం. గర్భిణుల్లో రక్తహీనత సమస్య, వైద్యంపై వ్యక్తిగత ఖర్చు 5 శాతానికి తగ్గించడమే మా లక్ష్యం' అని సీఎం వివరించారు.

సచివాలయంలో నిర్వహించిన అల్పాహార భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, బిల్‌గేట్స్. చిత్రంలో మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్ర, గేట్స్ ఫౌండేషన్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్, ఆఫ్రికా, ఇండియా కార్యాలయాల ప్రెసిడెంట్ అంకుర్ వోరా, గేట్స్ ఫౌండేషన్ ఇండియా డైరెక్టర్ అర్చనా వ్యాస్

**విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం**

'35 వేల పాఠశాలల్లో చదువుతున్న 13.4 లక్షల విద్యార్థులకు ఉపకరించేలా ఓఆర్ఎఫ్ టూల్ వినియోగిస్తున్నాం. రైతు సంక్షేమం కోసం సాంకేతికతను వినియోగిస్తున్నాం. గోధార్ ద్వారా పశువుల ఆరోగ్య సంరక్షణ చేపట్టాం. భూసార పరీక్షలు, మార్కెట్ సలహాలు, సమర్థ నీటి నిర్వహణ ద్వారా సాగులో పెను మార్పులు తీసుకొస్తున్నాం' అని చంద్రబాబు చెప్పారు.

**జులైకల్లా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని**

'డబ్ల్యూహెచ్‌వో, అశోక్ యూనివర్సిటీ సహకారంతో నేషనల్ హెల్త్ ఏఐ స్ట్రాటజీ వర్క్‌షాప్ నిర్వహించాం. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్, ఏబీడీఎం (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్) అమలు సహా తక్కువ ఖర్చుకే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో 71 లక్షల మందికి ఇప్పటికే 41 పరీక్షల ద్వారా స్క్రీనింగ్ పూర్తి చేశాం. సంజీవని కార్యక్రమాన్ని సమగ్ర ఆరోగ్య వేదికగా తీర్చిదిద్దుతున్నాం. కుప్పంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన సంజీవని ప్రాజెక్టు విజయవంతమైంది. దీన్ని జులై నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం. ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్‌ను ఇవ్వాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో డీఎంఐడీసీ స్థాపించి ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుగా 'అమరావతి స్కూల్ ఆఫ్ బయోడిజైన్' చేపట్టాం' అని చంద్రబాబు వివరించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం గేమ్‌ఛేంజర్: సీఎం**

'రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధికి కొత్త దశ- దిశ ఏర్పడుతుంది. బిల్ గేట్స్ అమరావతి రాక చరిత్రాత్మకంగా నిలవడంతోపాటు ప్రజల సాధికారతకు దోహదపడుతుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్‌గేట్స్‌కు ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు. 'పేదరిక నిర్మూలన, సంపూర్ణ ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నీటిభద్రత, రైతు- అగ్రిటెక్, ప్రపంచస్థాయి లాజిస్టిక్స్, ఎనర్జీ- ఫ్యూయల్, ప్రొడక్ట్ పర్‌ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్‌టెక్.. ఇలా పది సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానం. దీనికి ఆధార్ ధ్రువీకరణ, వ్యక్తిగత కుటుంబ డేటా లేక్, కుటుంబ సమాచారం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సమగ్ర డేటా, ఎవేర్ ద్వారా రియల్‌టైమ్ డేటా సేకరణ, వాట్సప్ గవర్నన్స్, డీజీవెరిఫై వంటి అప్లికేషన్ల వినియోగం ద్వారా భవిష్యత్తు కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం. క్వాంటమ్ వ్యాలీ- డిజైన్- ఫౌండ్రీగా అమరావతి, డేటా ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు, ఎలక్ట్రానిక్స్- ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్- స్పేస్ సిటీగా తిరుపతిలను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం పది రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నాం. 98 ఏఐ యూజ్ కేసులు, 43 హ్యాకథాన్లు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నాయి. మొత్తం ఏడు డేటా లేక్ ప్రాజెక్టులు ప్రారంభించాం' అని చంద్రబాబు తెలిపారు.

# సాగర తీరంలో నౌకాదళ విన్యాసాలు...

అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం విశాఖపట్నం రానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయుధ దళాల సర్వ సైన్యాధ్యక్షురాలి హోదాలో రాష్ట్రపతి ఈ విన్యాసాలను సమీక్షిస్తారు. అంతర్జాతీయ నౌకాదళ ప్రతినిధులు, యుద్ధనౌకలు, జలాంతర్గాములు, విమానాలు ఒకచోటకి చేరి తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడమే ఐఎఫ్ఆర్ ముఖ్య ఉద్దేశం.

మంగళవారం రాష్ట్రపతి గౌరవార్థం ఇచ్చే విందుతో ఐఎఫ్ఆర్-2026 కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు విశాఖ తీరంలో ఏర్పాటు చేసిన యాంకరేజ్ ప్రాంతంలో భారత్‌తో పాటు స్నేహపూర్వక దేశాలకు చెందిన సుమారు 70 యుద్ధనౌకల ఫ్లీట్‌ను రాష్ట్రపతి సమీక్షిస్తారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాల్గొంటారు. దేశాల మధ్య సముద్రయాన శక్తిని, సహకారాన్ని, స్నేహాన్ని ప్రదర్శించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని భారత నౌకాదళం వివరించింది.

ఈసారి ఐఎఫ్ఆర్‌లో 'ఆపరేషన్ సిందూర్' హీరో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ నౌకాదళాన్ని కట్టడి చేయడంలో ఈ యుద్ధనౌక వ్యూహాత్మకంగా కీలకపాత్ర పోషించింది. మిత్ర దేశాల నౌకాదళాలు ఈ విమాన వాహక నౌకను సమీపం నుంచి పరిశీలించనున్నాయి. ఈసారి విశాఖ కేవలం ఐఎఫ్ఆర్‌కే కాకుండా మరో రెండు కీలక కార్యక్రమాలకు కూడా వేదికైంది. భారత నౌకాదళం ఆధ్వర్యంలో 13వ ఎడిషన్ మిలాన్-2026, హిందూ మహాసముద్ర నౌకాదళ సింపోజియం సదస్సు కూడా ఇక్కడే జరుగుతున్నాయి. 135కి పైగా దేశాలను మిలాన్ విన్యాసాలకు ఆహ్వానించారు. భారత్ ఈ మూడు ప్రధాన సముద్రయాన కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించడం ఇదే ప్రప్రథమం. భారత్‌లో తొలి ఐఎఫ్ఆర్‌ను 2001లో ముంబైలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ సమీక్షించారు. రెండోసారి 2016లో విశాఖపట్నంలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఇప్పుడు మూడోసారి జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా భారత నౌకాదళ శక్తి, అంతర్జాతీయ సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి.

## కిమ్ రాజ్యంలో 'అత్తాకోడళ్ల' పోరు తప్పదా..?

-**మొదటిపేజీ తరువాయి**

ఈ నెలాఖరులో కిమ్‌కు చెందిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఆయన తన వారసత్వ ప్రణాళికలకు పార్టీ పరంగా ఆమోదముద్ర వేసుకునే అవకాశం ఉందని తెలిపింది. 13 ఏళ్ల కిమ్ జు యే 2022లో తొలిసారిగా ప్రపంచానికి కనిపించింది. ఆ తర్వాత ఆయుధ పరీక్షల నుంచి మిలిటరీ పరేడ్‌ల వరకు పలు అధికారిక, కీలక కార్యక్రమాల్లో తండ్రి వెంట హాజరైంది. వాస్తవానికి ఉత్తరకొరియా పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆమెకు వారసత్వ బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ, గతేడాది సెప్టెంబరులో కిమ్ జోంగ్ ఉన్‌తో కలిసి బీజింగ్ పర్యటనకు వెళ్లడంతో ప్రపంచం దృష్టి ఆమెపై పడింది. కిమ్ రాజకీయ వారసురాలు ఆమెనే అనే అంచనాలు నాటినుంచే బలపడ్డాయి.

**సోదరీ.. శక్తిమంతమైన నాయకురాలే**

అయితే, వారసత్వ పగ్గాల బదిలీ విషయంలో కిమ్ జోంగ్ ఉన్‌కు తన సోదరి కిమ్ యో జోంగ్ నుంచి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. 38 ఏళ్ల యో జోంగ్ ప్రస్తుతం దేశంలోనే రెండో అత్యంత శక్తిమంతమైన నాయకురాలిగా పేరొందారు. కొరియా వర్కర్స్ పార్టీ సెంట్రల్ కమిటీలో సీనియర్ హోదాలో ఆమె కొనసాగుతున్నారు. ఆమెకు దేశం లోపలా, వెలుపలా మంచి పాపులారిటీ ఉంది. సోదరుడి కిమ్ జోంగ్ ఉన్ పాలన పైనా ఆమె ప్రభావం చూపించగలరని చెబుతారు. 2022లో దక్షిణ కొరియా రక్షణమంత్రిని టార్గెట్ చేస్తూ కిమ్ యో జోంగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దక్షిణ కొరియా వినాశనం తప్పదంటూ ఆమె నాడు తీవ్రంగా బెదిరించారు. ఆ తర్వాత కూడా పలుమార్లు అమెరికా, జపాన్ వంటి దేశాలను హెచ్చరిస్తూ వార్తల్లో నిలిచారు. కిమ్ జోంగ్ ఉన్‌కు హఠాత్తుగా ఏమైనా జరిగితే అధికార బాధ్యతలు అందుకునేది

అతని సోదరి అని గతంలో అంచనాలు వెలువడ్డాయి. రాజకీయంగానే గాక.. ఆమెకు మిలిటరీ మద్దతు కూడా ఉంది. అవకాశం వస్తే దేశ నాయకత్వ పగ్గాలను అందుకోవడానికి అన్నివిధాలా ఆమె సిద్ధంగా ఉన్నారంటూ దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ మాజీ అధికారి ఒకరు ఆ మధ్య అంచనా వేశారు.

**కిమ్ కుటుంబంలో 'రక్తచరిత్ర'..**

కిమ్ కుటుంబంలో ఇలాంటి తగాదాలు కొత్తేం కాదు. రాజకీయంగా తన ఎదుగుదలకు అడ్డు అని భావించిన వారిని కిమ్ చాకచక్యంగా తప్పిస్తారనే ప్రచారం ఉంది. అధికారంలోకి వచ్చిన కొన్నేళ్ల తర్వాత 2013లో తన బంధువు, మెంటార్ అయిన జాంగ్ సోంగ్ థేక్‌కు మరణశిక్ష

అమలు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై కిమ్ ఈ చర్యలు తీసుకున్నట్లు నాడు వార్తలు వచ్చాయి. ఇక, కిమ్ సవతి సోదరుడు కిమ్ జోంగ్ నామ్ 2017లో మలేసియా ఎయిర్‌పోర్టులో హత్యకు గురయ్యారు. ఆ ఘటన వెనక కిమ్ హస్తం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

జయపుర, ఫిబ్రవరి 16: రాజస్థాన్లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని కర్మాగారాల్లో పని చేస్తున్నవారిని ఖాళీ చేయించామన్నారు. ఈ ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉ న్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. ప్రమాదంలో రూ. లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిదయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ దిగ్భ్రాం-రతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

## ఏఐ సమ్మిట్కు భారత్ వేదిక కావడం గర్వకారణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: దేశ రాజధాని ఢిల్లీలోని భారత్‌మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ మన దేశంలో జరుగుతుండడం గర్వకారణమన్నారు. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే ఈ సదస్సుథీమ్ పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్ ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు దిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల ఎకోసిస్టము ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

## భారత్ శక్తివంతమైన దేశం..

-**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యంగా పశ్చిమాసియాలో ప్రస్తుతం ఉన్న ఉద్రిక్త పరిస్థితులపై కూడా ఇద్దరు నేతలు చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్-ఇజ్రాయెల్ మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం పై సంతకాలు జరిగాయి. రెండు దేశాలు కలిసి కొత్త రకమైన ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తయారు చేసుకునేలా గతంలోనే కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ పర్యటనతో ఆ బంధం మరింత బలపడనుంది.

## 5 ఏళ్లలో ఐటీ, బీపీఓ జాబ్స్ మాయం..!

-**మొదటిపేజీ తరువాయి**

తన అభిప్రాయాలను పంచుకుంటూ ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. ఏఐ దెబ్బకు రాబోయే 5 ఏళ్లలో భారతదేశపు ప్రధాన ఆదాయ వనరులైన ఐటీ సేవలు, బీపీఓ రంగాలు దాదాపుగా కనుమరుగవుతాయని బాంబు పేల్చారు. అయితే ఆయన చెప్పిన మాటలు కూడా ప్రస్తుతం ఏఐ దూకుడు చూస్తుంటే వాస్తవికతగా చాలా దగ్గరగానే ఉన్నాయి.

**5 ఏళ్లలోనే ఐటీ రంగాని ముగింపు?**

గతంలో వచ్చిన ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ విప్లవాలు కేవలం ప్లాట్‌ఫామ్‌లను మాత్రమే మార్చాయన్నారు వినోద్ ఖోస్లా. కానీ ఏఐ అనేది నేరుగా మానవ మేధస్సునే భర్తీ చేస్తోందని వెల్లడించారు. అందువల్ల రానున్న ఐదేళ్లలో చాలా విషయాల్లో మనుషుల కంటే ఏఐ మెరుగ్గా పనిచేస్తుందని.. దీనివల్ల ప్రస్తుతం మనం చూస్తున్న సాంప్రదాయ ఐటీ సర్వీసెస్, బీపీఓల అవసరం ఉండదని కుండ బద్దలు కొట్టారు. ఇప్పుడు 22-25 ఏళ్ల వయసున్న యువత తమ 40వ ఏటకు వచ్చేసరికి ప్రపంచంలో ఉద్యోగాల సంఖ్య ఊహించనంతగా తగ్గిపోతుందని హెచ్చరించారు.

కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే కాదు.. రాబోయే 15 ఏళ్లలో అకౌంటెంట్లు, డాక్టర్లు, లాయర్లు, ఆర్కిటెక్టు, చిప్ డిజైనర్లు వంటి నిపుణుల అవసరం కూడా తగ్గిపోతుందని ఖోస్లా అంచనా వేశారు. ఏఐ వర్కర్లు మానవ అకౌంటెంట్ల కంటే మెరుగ్గా లెక్కలు తేల్చగలరని, క్యాన్సర్ నిర్ధారణలో నిష్ణాతులైన డాక్టర్ల కంటే ఏఐ మెరుగ్గా పనిచేస్తుందని వివరించారు. దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదకత పెరిగినప్పటికీ.. ఉపాధి ఉద్యోగ అవకాశాలు మాత్రం భారీగా దెబ్బతింటాయన్నారు.

**రోబోటిక్ విప్లవం..**

మేధోపరమైన పనుల తర్వాత రోబోటిక్ విప్లవం వస్తుందని.. ఇది శ్రమతో కూడిన పనులను పూర్తిగా మార్చేస్తుందని ఖోస్లా చెప్పారు. ఇంట్లో గిన్నెలు కడగడం నుంచి ఫ్యాక్టరీ అసెంబ్లీ లైన్ల వరకు రోబోలే ఆక్రమిస్తాయని వీటి నిర్వహణ ఖర్చు గంటకు కేవలం 2 నుంచి 3 డాలర్లు అంటే దాదాపు రూ.160 - రూ.250 మాత్రమే ఉంటుందని వెల్లడించారు. దీనివల్ల 2035 నాటికి ప్రపంచవ్యాప్తంగా వస్తువుల ధరలు విపరీతంగా తగ్గి డీఫ్లేషనరీ ఎకానమీ ఏర్పడుతుందని షాకింగ్ విషయం వెల్లడించారు.

**భారతదేశానికి ఏకైక మార్గం ఇదే..**

భారత్ తన వద్ద ఉన్న 25 కోట్ల మంది యువతను కేవలం ఐటీ సేవలకే పరిమితం చేయకుండా.. ఏఐ ఆధారిత వస్తువులను, సేవలను ప్రపంచానికి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ఖోస్లా సూచించారు. దేశం సొంతంగా సావరిన్ ఏఐ మోడళ్లను అభివృద్ధి చేసుకోవాలని.. అప్పుడే అమెరికా, చైనాల ఆధిపత్యాన్ని అడ్డుకోగలమని చెప్పారు. అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ వలస విధానాలు ఆ దేశానికే నష్టమని.. హెచ్-1బీ వీసాలపై ఆంక్షలు ఆవిష్కరణలను అడ్డుకుంటాయని విమర్శించారు. మొత్తానికి వినోద్ ఖోస్లా మాటలు వింటుంటే మార్పును అందిపుచ్చుకున్న వారు మాత్రమే ఈ ఏఐ సునామీలో నిలబడగలరని తెలుస్తోంది. ఈ మార్పును తట్టుకోవడానికి ప్రభుత్వాలు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఆయన హెచ్చరించారు.

## వైకాపా హయాంలోని ఇళ్ల పట్టాలపై విచారణ చేయాలి

-**మొదటిపేజీ తరువాయి**

జగన్ ప్రభుత్వంలో లక్షల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, భూమి చూపించకుండా ప్రజల్ని మోసం చేశారని ఆరోపించారు. భాజపా నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమంలో ఈ సమస్యపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నందున, రాష్ట్ర వ్యాప్తంగా భాజపా నేతలు కలెక్టరేట్‌లో వినతిపత్రాలు అందించినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. '2024 ఎన్నికల్లో గెలవాలనే కుట్రతో రాష్ట్రంలో 30 లక్షలకు పైగా పట్టాలు ఇవ్వాలని అప్పటి వైకాపా ప్రభుత్వం పిలుపునిచ్చింది. దీంతో పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని, లక్షల్లో పట్టాలు పంపిణీ చేశారు. ఈ పట్టాలన్నీ ఎందుకూ పనికిరాని చిత్తుకాగితాల్లా పేదల ఇళ్లలో ఉన్నాయి. అప్పట్లో ఇల్లు వస్తుందని పేదలకు ఆశ చూపి.. పట్టా కాగితం చేతిలో పెట్టి.. స్థలం చూపించలేదు. ఇది ఎన్నికల మోసం కాదా..? వైకాపా ప్రభుత్వ అక్రమాలపై ఉదాసీనంగా ఉండడం సరికాదు. పేదలకు ఇచ్చిన పట్టాల్లో భూమి లేనివి ఎన్నో గుర్తించాలి. ఇచ్చినవి నకిలీ పట్టాలని తేలితే ఎన్నికల మోసం కింద కేసులు పెట్టాలి. ప్రజల్ని మోసం చేసిన నాయకులపై నిషేధం విధించాలి' అని మాధవ్ పేర్కొన్నారు.

PEN SATTA
Telugu Daily
పెన్ సత్తా
మంగళవారం 17 ఫిబ్రవరి 2026

# బీజేపీ నేత నాగేంద్రన్ వ్యాఖ్యలను ఖండించిన త్రిష లాయర్



**తమిళనాడు: పెన్ సత్తా, ఫిబ్రవరి 16:**తమిళనాడు బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యల పై త్రిష స్పందించారు. ఆమె తరఫున లాయర్ నిత్యేష్ నటరాజ్, నాగేంద్రన్ వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. తమిళనాట రాజకీయాలు, సినిమా వేర్వేరు కాదు. చాలామంది సినీ ప్రముఖులు రాజకీయ పార్టీలు పెట్టారు. కొందరు రాజకీయ నాయకులు నటన మీద ఆసక్తితో ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చారు. అయితే స్టార్ హీరో విజయ్ తమిళగ వెట్రి కళగం పార్టీ పెట్టిన తర్వాత ఆయనకు త్రిషతో ఉన్న అనుబంధాన్ని కొందరు రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు, పార్టీ శాసనసభాపక్ష నేత నయినార్ నాగేంద్రన్, విజయ్ - త్రిష అనుబంధం గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీని పై ఆ పార్టీకి మద్దతు పలుకుతున్న ఇతర పార్టీల నేతలు సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. నటీనటుల వ్యక్తిగత విషయాల గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సబబు కాదని వారంతా ఖండించారు. తాజాగా త్రిష తరఫున లాయర్ నిత్యేష్ నటరాజ్ సైతం స్పందించారు. తన క్లయింట్ త్రిషా కృష్ణన్ సూచన మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి నుంచి ఇటువంటి అసంబద్ధ మైన, అనుచిత మైన వ్యాఖ్యలు వస్తాయని నా క్లయింట్ ఎప్పుడూ ఊహించలేదు. నా క్లయింట్‌కు ఎటువంటి రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు. భవిష్యత్తులో కూడా రాజకీయాల్లో చేరే ఉద్దేశం ఆమెకు లేదు. గతంలోనూ ఆమె ఈ విషయం స్పష్టంగా తెలియచేశారు. రాజకీయ అంశాల విషయంలో ఆమె ఎప్పుడూ తటస్థ వైఖరినే అనుసరిస్తోంది. ఓ నటిగా తనను గుర్తించాలన్నదే నా క్లయింట్ అభిలాష. రాజకీయ వ్యవహారాలను ఆమెకు ముడి పెట్టడం సరైనది కాదు. ముఖ్యంగా, వ్యక్తిగత జీవితాన్ని ప్రజా వేదికల్లో చర్చకు దారి తీసే అంశంగా మార్చకూడదు. ప్రజా జీవితంలో ఉన్నత స్థానాల్లో ఉన్నవారు బాధ్యతతో, సమతుల్యంగా మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నా క్లయింట్ కు సంబంధం లేని విషయాల్లో ఆమె పేరును అనవసరంగా ప్రస్తావించవద్దని మనవి చేస్తున్నాం అని అందులో పేర్కొన్నారు. ఈ ప్రకటన వచ్చిన కొద్ది సేపటికే బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్రన్ త్రిషకు క్షమాపణలు తెలిపారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు చెప్పారు.

# కొలువు తీరిన కొత్తగూడెం కార్పోరేషన్ పాలక మండలి





- మేయర్ గా మూడ్ గణేష్
- డిప్యూటీ మేయర్గా లలిత కుమారి
- చెరో రెండున్నరేళ్ల పాలన
- బిఆర్ఎస్ కార్పోరేటర్లు గైర్హాజర్
- ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి
- సందడిగా మారిన ప్రాంగణం

పెన్ సత్తా, ఫిబ్రవరి 16:కొత్తగూడెం కార్పోరేషన్ తొలి పాలకవర్గ కొలువుతీరింది. మేయర్ మూడ్ గణేష్ (20వ డివిజన్) డిప్యూటీ మేయర్ గా సిరిపురపు లలితకుమారి (8వ డివిజన్)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలూత ఆయా డివిజన్ల నుండి గెలుపొందిన వారితో కార్పోరేటర్లుగా జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాలరావు ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎంపిక జరిగింది. సిపిఐ కార్పోరేటర్ అడుసుమిల్లి సాయిబాబా మేయర్ గా మూడ్ గణేష్ను ప్రతిపాదించగా స్వతంత్ర కార్పోరేటర్ కంభంపాటి దుర్గాప్రసాద్ బలపరిచారు. డిప్యూటీ మేటర్గా సిరిపుర వులలిత కుమారిని కనుకుంట్ల శ్రీనివాస్ ప్రతిపాదించగా బోయిన విజయ్ కుమార్ బలపరిచారు. దీంతో మూడు రోజుల ఉత్కంఠతకు తో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చెరో రెండున్నరేళ్ల పాటు

అభ్యర్థుల నామినేషన్ల నాటి నుండి ఎన్నికల ఫలితాలు వెలువడి, పదవులు చేపట్టేంత వరకు తీవ్ర ఉత్కంఠ వాతావరణం కార్పోరేషన్ వ్యాప్తంగా నెలకొంది. ప్రధానంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు సీట్లు సమానంగా రాగా మేయర్ పీఠం ఎవరిని వరిస్తుందో అనే టెన్షన్ నెలకొంది. కాగా సిపిఐ, కాంగ్రెస్ల అగ్రనాయకత్వం చర్చోపచర్చల అనంతరం ఐదేళ్ల పాలనను చెరో రెండున్నరేళ్ల పాటు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఒప్పందంలో భాగంగా తొలి రెండున్నరేళ్లు సిపిఐ కు చెందిన మూడ్ గణేష్ మేయర్, కాంగ్రెస్కు చెందిన సిరిపురపు లలిత కుమారి డిప్యూటీ మేయర్ గా పదవులు చేపట్టారు. మరో రెండున్నరేళ్లు మేయర్గా కాంగ్రెస్, డిప్యూటీ మేయర్ పదవిని సిపిఐ చేపట్టనుంది. దీంతో కొత్తగూడెం తొలి కార్పోరేషన్ పాలక మండలి కొలువుతీరింది. ఇందిలా ఉండగా బిఆర్ఎస్ నుండి గెలిచిన ఎనిమిది మంది కార్పోరేటర్లు గైర్హాజరయ్యారు. కాగా వీరు మరోరోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

సమిష్టిగా

ఇరు పార్టీల అగ్రనాకత్వం ఒప్పందం ప్రకారం సమిష్టిగా కలిసి ముందుకు సాగేందుకు నిర్ణయించుకున్నారు. ఇందు కోసం ప్రమాణస్వీకారానికి ముందుగా ఓ హోటల్లో ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎయిఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పల్లా వెంకటరెడ్డి, భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషాలు కార్పోరేటర్లతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. జరిగిన ఒప్పందాన్ని వారికి వివరించి అదినాయకత్వం మాటే శిరోధార్యమని చెప్పి మేయర్, డిప్యూటీ మేయర్ పేర్లను ప్రకటించారు. అనంతరం ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో దారి పోడవునా సందడి వాతావరణం నెలకొంది. ర్యాలీలో అగ్రభాగాన కూనంనేని నిలవడంతో పెద్ద ఎత్తున అభివాదాలు, నినాదాలు మిన్నంటాయి.

సందడి సందడిగా

ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కార్పోరేషన్ కార్యాలయం ఆవరణ సందడిగా మారింది. ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్ల బంధువులు, స్నేహితులు, అభిమానులు, సన్నిహితులతో ఆ ప్రాంగణం-జనసంద్రమైంది. ప్రామాణ స్వీకారం అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్లు బయటకు రాగా పెద్దపెట్టున నినానాదలు చేశారు. వారిని కలుసుకుని అభినందనలు తెలిపేందుకు పోటెత్తారు .

# బలపడనున్న అల్పపీడనం




**వాతావరణం: పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాతావరణం వేగంగా మారుతోంది. ఒకవైపు బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కనిపిస్తుండగా, మరోవైపు రాత్రి వేళల్లో చలి, ఉదయం పూట దట్టమైన పొగమంచు, మరో వైపు ఎండలు జనజీవనాన్ని ప్రభావితం చేస్తోంది. దీనికి సంబంధించి వాతావరణ కేంద్రం తాజా నివేదికను విడుదల చేసింది. తూర్పు భూమధ్య రేఖా హిందూ మహాసముద్రం, దక్షిణ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఫిబ్రవరి 16 ఉదయం 8.30 గంటలకు అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వ్యవస్థ సముద్ర మట్టానికి సుమారు 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉండగా, ఫిబ్రవరి 18 నాటికి పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతం పై మరింత బలపడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే రాష్ట్రంలో తక్షణ ప్రభావం మాత్రం పరిమితంగానే ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వచ్చే మూడు రోజుల పాటు ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో ప్రధానంగా పొడి వాతావరణమే కొనసాగనుంది. ఈరోజు, రేపు కొన్ని చోట్ల దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేశారు. ఎల్లుండి కూడా వర్ష సూచనలు కనిపించడం లేదు. రాయలసీమలో కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది. అయితే అక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశముందని స్పష్టం చేశారు. కోస్తాంధ్రలో మాత్రం కనిష్ట ఉష్ణోగ్రతల్లో గణనీయ మైన మార్పు ఉండదని తెలిపారు. నిన్న రాష్ట్రంలో అత్యధికంగా నందిగామలో 35.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే సమయంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో దట్టమైన మంచు ప్రభావం స్పష్టంగా కనిపించింది. రహదారుల పై విజిబిలిటీ తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని వాతావరణ శాఖ సూచించింది. కొన్ని ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడంతో స్థానిక అధికారులు అప్రమత్తమయ్యారు. మొత్తానికి, అల్పపీడన ప్రభావం రాష్ట్రం పై నేరుగా లేకపోయినా.. పొగమంచు, చల్లని వాతావరణం ప్రజలను ఇబ్బంది పెట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

# అస్సాం సిఎం పై విచారించేందుకు నిరాకరించిన సుప్రీం కోర్టు



**న్యూ ఢిల్లీ : పెన్ సత్తా, ఫిబ్రవరి 16:**అస్సాం సిఎం పై ద్వేష ప్రసంగం పై ఎఫ్ఐఆర్ కోరుతూ దాఖలైన వరుస పిటిషన్లను విచారించేందుకు సుప్రీం కోర్టు సోమవారం నిరాకరించింది. ఈ పిటిషన్‌ల విచారణకు తగిన కారణాలు లేవు అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ముగ్గురు జడ్జీల ధర్మాసనం అభిప్రాయపడింది. సిపిఐ(ఎం), సిపిఐ సహా ఇతర పిటిషనర్లను రాష్ట్ర హైకోర్టు సంప్రదించాలని సూచించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక విలువలు, నైతికతకు హాని కలిగించే విధంగా ఏ రాజకీయ నేత లేదా రాజ్యాంగ పదవిలో ఉన్నవారు ప్రవర్తించకూడదని, ముఖ్యంగా ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ప్రవర్తించ కూడదని పిటిషనర్లతో సుప్రీం కోర్టు ఏకీభవించినప్పటికీ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు నిరాకరించింది. రాజ్యాంగ బద్ధంగా అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిస్వా శర్మ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, రాష్ట్రంలో నివసిస్తున్న ముస్లిం కమ్యూనిటీ పై శతృత్వాన్ని, బహిరంగ హింసను లక్ష్యంగా చేసుకుని, భయ భ్రాంతులకు గురిచేసే, రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఎ.ఎం.సింఘ్వీ, సి.యు.సింగ్, నిజాం పాషాలు వాదించారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ సహా ఇతర రాష్ట్రాల్లోనూ అస్సాం సిఎం ఇటువంటి ద్వేషపూరిత ప్రసంగాలు చేశారని అన్నారు. ఈ ప్రవర్తనను శర్మ అలవాటుగా సింఘ్వీ అభివర్ణించారు. హైకోర్టు ఎదుట దాఖలు చేసిన పిటిషన్లను త్వరగా జాబితా చేసి విచారించాలని గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీం కోర్టు ఆదేశించింది.

# శబరిమలలో మహిళలకు ప్రవేశం..

- 9 మందితో సుప్రీం దర్మాసనం



**న్యూ ఢిల్లీ: పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** కేరళ లోని శబరిమల అయ్యప్ప ఆలయం లోకి మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ల పై 9 మంది న్యాయ మూర్తుల సుప్రీం కోర్టు ధర్మాసనం ఏప్రిల్ 7 నుంచి విచారణ చేపట్టనుంది. మందిరం లోకి 10 నుంచి 50 ఏళ్ల లోపు మహిళలకు శబరిమల ధర్మాశాస్త ఆలయం దశాబ్దాలుగా నిరాకరిస్తోంది. దీనికి 2018 లో అత్యున్నత న్యాయస్థానం స్వస్తి చెప్పింది. అన్ని వయస్సుల వారికి ప్రవేశం కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి అప్పగించేందుకు 2020 ఫిబ్రవరి 10 న సుప్రీం కోర్టు అంగీకరించింది. ఈ నేపథ్యంలో సంబంధిత పార్టీలు తమ వాదనలను మార్చి 14 లోగా అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం శబరిమల సమీక్ష కేసు పై ఏప్రిల్ 7 వ తేదీ ఉదయం 10 గంటల నుంచి విచారణ జరుపుతుంది. ఏప్రిల్ 22 వరకూ రెండు వారాల పాటు విచారణకు సమయం కేటాయిస్తున్నాం. రివ్యూ పిటిషనర్లు, వారికి సపోర్ట్ చేసే పార్టీ వాదనలను ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 9 వరకూ విచారిస్తుంది. రివ్యూను వ్యతిరేకించే వారి పిటిషన్లను ఏప్రిల్ 14 నుంచి ఏప్రిల్ 16 వరకూ వింటాం అని సుప్రీం కోర్టు తెలిపింది. రిజాయిండర్ సబ్మిషన్లు ఉంటే ఏప్రిల్ 21 న వింటామని పేర్కొంది. సమీక్షకు మద్దతు ప్రకటించిన కేంద్రం: కాగా, పిటిషన్ల పై సమీక్షకు తాము మద్దతిస్తున్నట్టు కేంద్రం సోమవారం నాడు ప్రకటించింది. ఈ అంశం పై కేరళ లోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) తమ వైఖరిని స్పష్టం చేయాలని కాంగ్రెస్ సారథ్యం లోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) డిమాండ్ చేసింది. అయితే కోర్టుకు సమర్పించిన వివరాలను వెల్లడించలేమని సీపీఎం తెలిపింది.


# వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** పట్టణంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 32 వ ఆరాధన, మహా శివరాత్రి మహోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి ఆలయం వద్ద వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ కళ్యాణ జరిగిన సందర్భంగా సోమవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు కోసూరి మన్మధరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు కోరుకొండ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి తుంపాల సతీష్, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు.కామాక్షి కార్పెంటర్స్ సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు సభ్యులు పాల్గొన్నారు.

## కొలికపూడి మరో వాట్సాప్ రచ్చ..!

★ ఈసారి వైసీపీ కి ఆహ్వానం..!




**తిరువూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** కూటమి ప్రభుత్వంలో నిత్యం ఏదో రకంగా వార్తల్లో నిలుస్తున్న అతికొద్ది మంది రాజకీయ నేతల్లో తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఒకరు. గతంలో అమరావతి ఉద్యమంలో చురుగ్గా పనిచేసి టీడీపీ వద్ద మంచి మార్కులు కొట్టేయడమే కాకుండా తొలిసారి ఎమ్మెల్యే సీటు కూడా సంపాదించుకున్న కొలికపూడి, ఆ తర్వాత మాత్రం నిత్యం వివాదాలతో సావాసం చేస్తూనే ఉన్నారు. వీటి పై సొంత పార్టీ టీడీపీ అధిష్టానం పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఆయన మాత్రం అదే బాటలో ఉన్నట్లు కనిపిస్తోంది. గతంలో పలుమార్లు సొంత పార్టీలో తన రాజకీయ ప్రత్యర్థి అయిన విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వర్గానికి చెందిన నేతల పై వాట్సాప్ స్టేటస్ లు పెట్టి వివాదాల్లో చిక్కుకున్న కొలికపూడి శ్రీనివాస్ ఈ విషయంలో అధిష్టానానికి వివరణలు కూడా ఇచ్చారు. అయితే ఇప్పుడు ఆయన మరోసారి వాట్సాప్ స్టేటస్ పెట్టారు. ఇందులో ఆయన విపక్ష వైఎస్సార్సీపీకి ఆహ్వానం పలుకుతూ ఉన్నట్లు ఉంది. దీంతో కొలికపూడి మనసులో ఏముందో తెలియక సొంత పార్టీ నేతలు తికమక పడుతున్నారు. ఇంతకీ ఆ వాట్సాప్ స్టేటస్ ను కొలికపూడి ఎందుకు పెట్టారో తెలుసా ?, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టింది. ఇందులో పలు అంశాల పై విపక్షాలు విమర్శలు ఎక్కుపెడుతున్నాయి. దీంతో బడ్జెట్ లోని సానుకూల అంశాల్ని జనంలోకి తీసుకెళ్లి చర్చ పెట్టాలని కూటమి పార్టీల ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎవరికి వారు స్థానికంగా బడ్జెట్ పై రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చలు పెడుతున్నారు. అయితే ఇక్కడ కొలికపూడి చేసిందేంటే ఏకంగా విపక్ష వైసీపీతో పాటు ఇతర పార్టీల్ని కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. తద్వారా ఆయన మరోసారి వార్తల్లో నిలిచారు.

## మేఘా అనుబంధ సంస్థలో వైస్ ప్రెసిడెంట్‌గా జేడీ లక్ష్మీనారాయణ




**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** సీబీఐలో జేడీగా పని చేసిన వీవీ లక్ష్మీనారాయణ, కొత్త జాబ్ లో చేరారు. మేఘా ఇంజినీరింగ్ కంపెనీ అనుబంధ సంస్థ అయిన ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ విషయాన్ని ఆ సంస్థే స్వయంగా వెల్లడించింది. మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, తర్వాత ఎంటెక్ చదివిన లక్ష్మీనారాయణ ఐపీఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టడానికి ముందు అశోక లేల్యాండ్‌లో పనిచేశారు. ఇప్పుడు మళ్లీ ఈవీ ట్రాన్స్‌లో చేరారు. వాసగిరి వెంకట లక్ష్మీనారాయణ ఈ పేరు చెప్పగానే చాలా మందికి ఆయనెవరో గుర్తు రాకపోవచ్చు. కానీ జేడీ లక్ష్మీనారాయణ అంటే చాలు ఠక్కున గుర్తుపడతారు. సీబీఐ అధికారిగా జగన్ అక్రమాస్తుల కేసు సహా అనేక హై ప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేయడంతో ఆయన పేరు అప్పట్లో మార్మోగింది. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన వీవీ లక్ష్మీనారాయణ, ముంబైలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌గా పదవీ విరమణ పొందారు. అనంతరం రాజకీయాల్లోకి వచ్చిన ఆయన జనసేన తరఫున విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2023 లో జై భారత్ నేషనల్ పార్టీ పేరిట సొంత పార్టీ పెట్టారు. అంతకు ముందు తూర్పుగోదావరి జిల్లా ధర్మవరంలో ఆయన పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేశారు. ఆయన కుమారుడు కూడా ఆలిండియా సర్వీసులో పని చేస్తున్నారు. ఈవీ ట్రాన్స్ అనేది మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిన్)కు అనుబంధ సంస్థ. ఐపీఎస్ అధికారిగా దాదాపు మూడు దశాబ్దాలపాటు సుదీర్ఘ సేవలు అందించిన జేడీ లక్ష్మీ నారాయణను ఈవీట్రాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా తీసుకోవడానికి కారణం ఉంది. జేడీ లక్ష్మీనారాయణ ఎన్ఐటీ వరంగల్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చదివారు. అనంతరం ఐఐటీ మద్రాస్ నుంచి ఎంటెక్ పూర్తి చేశారు. తర్వాత అశోక్ లేల్యాండ్ ఆర్ అండ్ డీ విభాగంలో కెరీర్ మొదలుపెట్టారు. ఆ సమయంలో కమర్షియల్ వెహికల్ సిస్టమ్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎన్విరాన్మెంట్స్ మీద ఆయన అనుభవం సంపాదించారు. ఈవీట్రాన్స్ సంస్థ ఎలక్ట్రిక్ బస్సుల తయారీని వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో లక్ష్మీనారాయణ అనుభవం, కార్య దక్షత తమకు ఉపకరిస్తాయని ఆ సంస్థ భావిస్తోంది. లక్ష్మీనారాయణ నియామకం విషయాన్ని ఈవీట్రాన్స్ సంస్థ లింక్డ్ఇన్ ద్వారా స్వయంగా వెల్లడించింది. 2006-13 మధ్య డిప్యూటేషన్ మీద సీబీఐకి వెళ్లిన లక్ష్మీనారాయణ, జాయింట్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. ఈ సమయంలో ఆయన అనేక హైప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేశారని కూడా ఈవీట్రాన్స్ గుర్తు చేసింది.తెలంగాణ ఆర్టీసీలో నడుస్తోన్న ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను ఈ సంస్థే తయారు చేసింది. ఒక్క తెలంగాణ ఆర్టీసీనే కాకుండా ముంబై, పుణే, గోవా తదితర ప్రాంతాల్లో ఈ సంస్థ తయారు చేసిన ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు తీస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈవీట్రాన్స్.. దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్‌గా అవతరించింది.

ఇదిలా ఉండగా లక్ష్మీనారాయణ భార్య ఇటీవల ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో రూ.2.58 కోట్లు మోసపోయిన సంగతి తెలిసిందే. ట్రేడింగ్ నిపుణులమని పరిచయం చేసుకొని, భారీ లాభాలు ఆశచూపిన స్కామర్లు ఊర్మిళను మోసం చేశారు. దీంతో లక్ష్మీనారాయణ దంపతులు జనవరి నెలలో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

# కన్నతల్లిని వెతుక్కుంటూ భారత్ కు






నెదర్లాండ్స్ నగర మేయర్, ఏమిటి ఈయన కథ?

**ఇంటర్నెట్ డెస్క్ : పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** మా అమ్మ తప్పు చేశాననే అపరాధ భావనతో జీవిస్తూ ఉండొచ్చు. ఆమెను కలిసి నేను బాగానే ఉన్నానని చెప్పాలి. అమ్మా మీ అబ్బాయి చాలా ప్రేమ, ఆప్యాయతల మధ్య పెరిగాడని చెప్పాలనుకుంటున్నా. ఈ మాటలు తన తల్లితో చెప్పేందుకు నెదర్లాండ్స్ నుంచి నాగ్‌పూర్ చేరుకున్నారు ఫాల్గుణ్. నెదర్లాండ్స్ లోని హీమ్‌స్టెడ్ నగర మేయర్ గా ఫాల్గుణ్ బినెన్‌డిజ్క్ వున్నారు. ఆయన 40 ఏళ్ల తర్వాత తనకు జన్మనిచ్చిన తల్లిని వెతుక్కుంటూ నాగ్‌పూర్ వచ్చారు. కన్నతల్లి కోసం ఇప్పటికి నాలుగుసార్లు ఆయన భారత్ వచ్చారు. తనను పెంచలేకపోయినందుకు ఆందోళన చెందవద్దని, బాధపడొద్దని చెప్పడానికే తల్లిని కలవాలనుకుంటున్నట్లు ఫాల్గుణ్ మీడియాతో చెప్పారు. ఫాల్గుణ్ 1985 ఫిబ్రవరి10 న నాగ్‌పూర్ లోని ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టారు. చిన్నప్పుడే ఆయనను నాగ్‌పూర్ లోని మాతృ సేవా సంఘ్ కు అప్పగించారు. ఆయన అక్కడ 3 రోజులు ఉన్నారు. ఆ సంస్థలో పని చేస్తున్న నర్సు ఆయనకు ఫాల్గుణ్ అనే పేరు పెట్టారు. చిన్నప్పుడే ఆయన్ను నెదర్లాండ్స్‌కు చెందిన ఓ జంట దత్తత తీసుకుని తమతో తీసుకెళ్లింది.

ఫాల్గుణ్ నెదర్లాండ్స్ లోనే మంచి కుటుంబంలో పెరిగారు. అక్కడ తల్లిదండ్రులు తనను చాలా ప్రేమగా పెంచారని ఆయన చెప్పారు. నన్ను దత్తత తీసుకున్నారనే విషయం ఎప్పుడూ బాధించలేదు. ఎందుకంటే, అది నా జీవితంలో ఒక భాగం. నన్ను దత్తత తీసుకున్న విషయాన్ని పెంచిన తల్లిదండ్రులు కూడా దాచి పెట్టలేదు. నన్ను ఒక నర్సు ఎయిర్ పోర్టు కు తీసుకు వస్తున్న ఫోటో ఒకటి నా దగ్గరుంది. అదే నా చిన్ననాటి జ్ఞాపకం అని ఫాల్గుణ్ చెప్పారు.

తనను దత్తత తీసుకున్నారనే విషయం తెలిసిన తర్వాత, తన మూలాలను వెతికే ప్రయత్నం చేశారు. తల్లిని వెతుక్కుంటూ 2017 లో నాగ్‌పూర్ వచ్చారు. మాతృ సేవా సంఘ్‌ను సంప్రదించారు. అయితే, వారి వద్ద తన తల్లి పూర్తి అడ్రస్ లేదు. దీంతో ఆయన తన తల్లిని కలుసుకోలేకపోయారు. తర్వాత 2024 లో, అధికారుల సాయంతో ఆయన మరోసారి తల్లిని వెతికే పనిచేపట్టారు. ఈ విషయ మై తనకు సాయం చేయాలని జిల్లా కలెక్టర్ ను అభ్యర్థించారు. నాకు జన్మనిచ్చిన తల్లిని కనుక్కోవడానికి 8 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా అని ఫాల్గుణ్ చెప్పారు. మొదట్లో నేను ఎక్కడి నుంచి వచ్చానో తెలుసుకోవాలనుకున్నా దానిలో సక్సెస్ అయ్యా, నాగపూర్ వచ్చాను. మా అమ్మ కోసం వెతికే సమయంలో పెంచిన తల్లిదండ్రులు కూడా అండగా ఉన్నారు. వారు చాలా ప్రేమగా ఉంటారు అని ఆయన అన్నారు. గతేడాది డిసెంబర్ 21 న క్రిస్మస్ సెలవుల్లో ఫాల్గుణ్ తన కుటుంబంతో కలిసి నాగ్‌పూర్ వచ్చారు. తమ తండ్రి పుట్టిన ప్రాంతాన్ని ఆయన పిల్లలు చూడాలని అనుకున్నారు. పిల్లల కోరిక తీర్చడంతో పాటు తల్లిని వెతికేందుకు ఆయన మళ్లీ నాగ్‌పూర్ వచ్చారు. డిసెంబర్ 21 నుంచి జనవరి 3 వరకు అక్కడే ఉన్నారు. ఈ అన్వేషణలో తాను అనేక మందిని కలిశానని, వారిలో వినోద్ జాదవ్ ఒకరని ఆయన చెప్పారు. తొలిసారి కలిసినప్పటి నుంచే తన తల్లి ఎవరో కనుక్కునే బాధ్యతను జిల్లా సీనియర్ అధికారి వినోద్ జాదవ్ తీసుకున్నారని ఫాల్గుణ్ తెలిపారు. పుట్టిన నేలతో ఇంతటి అనుబంధం పెంచుకున్న ఫాల్గుణ్ లాంటి వ్యక్తిని నేనెన్నడూ చూడలేదు అని వినోద్ చెప్పారు. ఫాల్గుణ్ అసలు తల్లిని ప్రశ్నించాలని అనుకోవడం లేదు, కొడుకును ఎందుకు వదిలేయాల్సి వచ్చిందనే వివరాలు తెలుసు కోవాలని కూడా ఆయన అనుకోవడం లేదు, కానీ ఆమె మనసులో ఆందోళనను తొలగించాలని అనుకుంటున్నారు. నువ్వు జన్మనిచ్చిన కొడుకు ఈ రోజు ఉన్నత స్థానంలో ఉన్నాడని చెప్పాలనుకుంటున్నారు. తల్లి కోరుకుంటే తనతో తీసుకెళతానని, అక్కడ ఆమెకు ఏ ఇబ్బంది రాకుండా చూసుకుంటానని ఆయన చెప్పారు అని జాదవ్ వివరించారు. వినోద్ జాదవ్ కు ఫాల్గుణ్ ఒక లేఖ ఇచ్చారు. తన తల్లిని కలిసినప్పుడు ఆ లేఖ ఇవ్వాలని కోరారు. అది హిందీలో రాసి ఉంది. ఆయన నెదర్లాండ్స్‌లో ఉన్నప్పటికీ హిందీ నేర్చుకున్నారు. ఆయన భార్యా, పిల్లలు కూడా హిందీ నేర్చుకున్నారు. తన నలుగురు పిల్లలకు భారతీయ పేర్లు పెట్టారు. గతేడాది డిసెంబర్‌లో ఫాల్గుణ్ నాగ్‌పూర్ వచ్చినప్పుడు మాతృ సేవా సంఘ్ మాజీ అధ్యక్షురాలు మంగళ భుసారి, వినోద్ జాదవ్, జిల్లా బాలల రక్షణ అధికారి ముష్తాక్ పఠాన్‌లతో సమావేశమయ్యారు. వారు మాతృ సేవా సంఘ్ బాధ్యతలు చూస్తున్నప్పుడే ఫాల్గుణ్ ను అక్కడ అప్పగించారు. బాలుడిని ఫిబ్రవరిలో తమకు అప్పగించడంతో మంగళ ఆ చిన్నారికి ఫాల్గుణ్ అని పేరుపెట్టారు. ఇప్పుడాయన నెదర్లాండ్స్‌లో ఒక నగరానికి మేయర్‌గా ఉన్నారు. ఆయన తల్లి చిరునామాలో తాలుకా గురించి రాయలేదు. అందుకే ఆమెను గుర్తించడం కష్టతరంగా మారింది. అయితే, ఫాల్గుణ్ ఇక్కడకు వచ్చినప్పుడు తల్లిని కలుస్తానన్న బలమైన నమ్మకంతో ఉన్నారు. మీరు ఈ సంస్థలో నన్ను తల్లిలా పెంచారు, కాబట్టి మీరు కూడా నా తల్లిలాంటి వారే అని ఫాల్గుణ్ అన్నారు అని మంగళ భుసారి చెప్పారు.

ఫాల్గుణ్ తల్లిని కనుక్కునేందుకు జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారు. విదేశీ జంటలు దత్తత తీసుకున్న పిల్లలకు స్వదేశంలో తమ తల్లిదండ్రులను కనుక్కునే హక్కు చట్టబద్ధంగా ఉంది. ఇప్పుడు ఇదే చట్టం ప్రకారం, నాగ్‌పూర్ జిల్లా యంత్రాంగం ఫాల్గుణ్ తల్లిని గుర్తించే ప్రయత్నం చేస్తోంది. జిల్లా బాలల రక్షణ అధికారి ముష్తాక్ పఠాన్ ఈ బాధ్యత తీసుకున్నారు. చట్టప్రకారం ఈ బాధ్యత మాదే. మాకు అందిన సమాచారం ప్రకారం ఆయన దత్తత తీసుకున్న ఇంట్లో ఉన్నారు. అక్కడి సామాజిక కార్యకర్తలు మంగళ భుసారి, సెలోకర్‌లను మేం కలిశాం. మేం ఫాల్గుణ్ తల్లి లేదా బంధువులను గుర్తిస్తే, చట్ట ప్రకారం వారి అనుమతి తీసుకుని, వారితో ఫాల్గుణ్‌కు సమావేశం ఏర్పాటు చేస్తాం. ఫాల్గుణ్ తల్లి, బంధువులను గుర్తించే ఆపరేషన్ కొనసాగుతోంది అని ముష్తాక్ పఠాన్ మీడియాకు వివరించారు.

# పెళ్లికి ముందే ఎవరినీ నమ్మొద్దు..




సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** పెళ్లికి ముందే ఎవరినీ నమ్మొద్దు అని సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లికి ముందే శారీరక సంబంధం లోకి ఎలా వెళ్తారో అంటూ సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. జీవితంలో ఏదైనా ముఖ్యమైన బంధాన్ని ఏర్పరుచుకునే విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేసింది. పెళ్లికి ముందే ఎవరినీ నమ్మొద్దంటూ హితవు పలికింది. ఈ మేరకు ఓ అత్యాచార కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సుప్రీం కోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహానికి ముందు అంగీకారంతో శారీరక సంబంధం పై ప్రశ్నించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలున్న వ్యక్తి బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ల ధర్మాసనం విచారించింది. నిందితుడి బెయిల్ కేసులో భాగంగా ఫిర్యాదు దారురాలిని దుబాయ్ కు ఎందుకు వెళ్లావు, అక్కడ శారీరక సంబంధం ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. అంగీకారం ఉన్నప్పటికీ, మేము పాతకాలపు వార మై ఉండవచ్చు, కానీ వివాహానికి ముందు అబ్బాయి, అమ్మాయి పూర్తిగా తెలియని వ్యక్తులు. పెళ్లికి ముందు శారీరక సంబంధాలలో జాగ్రత్తగా ఉండాలి అని పీటీఐ ధర్మాసనం వ్యాఖ్యలను ఉటంకించింది. జస్టిస్ నాగరత్న వారి సంబంధం ఎంత ఉన్నా, వివాహానికి ముందు శారీరక సంబంధాలలో ఎలా నిమగ్నమవుతారో మాకు అర్థం కావడం లేదు. మేము పాతకాలపు వార మై ఉండవచ్చు, కానీ మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి, పెళ్లికి ముందు ఎవరినీ నమ్మొద్దు అని స్పష్టం చేశారు. మహిళ న్యాయవాది వాదన ప్రకారం, 2022 లో మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా వీరిద్దరు పరిచయం అయ్యారు. నిందితుడు పెళ్లి హామీతో ఢిల్లీలో పలుమార్లు, ఆపై దుబాయ్‌లో ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఈ వాదన పై ధర్మాసనం స్పందిస్తూ, ఆమె అంత కఠినంగా ఉంటే, వివాహానికి ముందే అక్కడికి వెళ్లరాదు. మేము వారిని మధ్యవర్తిత్వానికి పంపుతాము. అంగీకార సంబంధం ఉన్నప్పుడు విచారణ జరిపి శిక్షించాల్సిన కేసులు ఇవి కావు అని వ్యాఖ్యానించింది. ఫిర్యాదులో, నిందితుడు ఆమెను దుబాయ్‌కి ఒప్పించి, తప్పుడు పెళ్లి హామీతో శారీరక సంబంధాలు పెట్టుకున్నాడని మహిళ ఆరోపించింది. సమ్మతి లేకుండా సన్నిహిత వీడియోలు తీసి, ప్రచారం చేస్తానని బెదిరించినట్లు పేర్కొంది. జనవరి 2024 లో అతను పంజాబ్ లో వేరొక మహిళను పెళ్లి చేసుకున్నట్లు తర్వాత ఆమెకు తెలిసింది. ట్రయల్, ఢిల్లీ హైకోర్టులు నిందితుడి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాయి. అతను అప్పటికే వివాహితుడై, జనవరి 2024లో మళ్లీ పెళ్లి చేసుకున్నందున, పెళ్లి హామీ మొదటి నుంచీ అబద్ధమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. దీంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు నిందితుడు మహిళకు నష్టపరిహారం చెల్లింపు పై జస్టిస్ నాగరత్న సూచించారు. ధర్మాసనం మహిళ న్యాయవాదిని రాజీ సెటిల్‌మెంట్ అవకాశాలను పరిశీలించమని కోరింది. ఇరుపక్షాల వాదనలు వినేందుకు కేసును బుధవారానికి వాయిదా వేశారు.

# గ్రామీణ వైద్యుల సమస్య లు పరిష్కారం కోసం మౌన దీక్ష ధర్నా

**విజయవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** భారత దేశ చరిత్రలో తొలిసారి గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం మౌన దీక్ష ధర్నా. గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, డాక్టరేట్ అవార్డు గ్రహీత డా కొండి శెట్టి సురేష్ బాబు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలుకు వినతిచేసారు. సమస్యలు 1.గ్రామీణ వైద్యుల పై దాడులు ఆపాలి. 2. ఆపివేసిన పారామెడికల్ ట్రైనింగ్ కొనసాగించాలి. 3. గ్రామీణ వైద్యుల కు ఇళ్ల స్థలాలు పట్టాలు మంజూరు చేయాలి. 4. గొ 465 అమలు చేయాలి. 5. ప్రభుత్వ జీవనోపాధి పాలసీ అమలు చేయాలి. 6. అనుభవ ప్రాతిపదికిన కలిగియున్న వయస్సు పై పడిన వైద్యులకు ఫిన్షన్ మంజూరు చేయాలి. 7. ఆర్టికల్ 36 ప్రకారం సీనియర్లు అయిన ప్రాక్టిషనర్లు ను హెల్త్ ప్రొవైడర్స్ గా గుర్తించి ఉపాధి కలిగించాలి. అని ధర్నా చౌక్, గాంధీ నగర్ విజయవాడ నందు సోమవారం గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, డాక్టరేట్ అవార్డు గ్రహీత డా కొండి శెట్టి సురేష్ బాబు, జే ఏ సి జాతీయ అధ్యక్షులు డాక్టర్ బి.ఆర్ ఆంజనేయులు, అధ్యక్షులు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఏపీ జీ వీ ఎం పార్టీ ప్రధాన కార్యదర్శి నర్రా సునీత, రాష్ట్ర నాయకులు పసుపులేటి శ్రీనివాస్, రాజా రత్నా , సందీప్ కుమార్, తెలంగాణ జేఏసీ రాష్ట్ర నాయకులు




రవీంద్ర ఖలీల్ రాంబాబు, తదితరులు దీక్ష లో పాల్గొని జయప్రదం చేశారు.

# పంచకర్ల కి నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి








**పెందుర్తి, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** వేపగుంట – పినగాడి రోడ్డు, పినగాడి– గుల్లిపిల్లి రోడ్డు, సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్, ఆసకపల్లి – లంకెలపాలెం రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పంచకర్ల. నాలుగు నెలల్లో ఈ ప్రాంత రూపు రేఖలు మారుస్తామన్న జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. సోమవారం పెందుర్తి నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా సమస్యగా ఉన్న పినగాడి– వేపగుంట రోడ్డు విస్తరణ పనులను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. పనులు వేగవంతంగా జరుగుతున్న తరుణంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు జీవీఎంసీ, వి ఎం ఆర్ డి ఏ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులను వెంట బెట్టుకొని ఆ రోడ్డు పనులను పర్యవేక్షించారు. సుమారు 30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రోడ్ల విస్తరణను ఆయన ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు విస్తరణలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని అందరి సహకారంతో పనులు ప్రారంభించామని, వచ్చే నాలుగు నెలల్లో ఈ రోడ్డు పనులు పూర్తవుతాయని అన్నారు. ఈ రోడ్డు పూర్తయితే మాడుగులు, చోడవరం వెళ్లే వాహనదారులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. రోడ్డు పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ హర్షాతిరేకాలు వెల్లడించారు. ఎన్నో ఏళ్ల నాటి కలను సహకారం చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కి కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఆలయాలు, చర్చిలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి నష్టపరిహారాన్ని కూడా అందజేశారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం వారికి వేరొక చోట పునరావాసం కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సబ్బవరం ప్రధాన కూడలిలో ఎన్నో ఏళ్లుగా రోడ్డు ఆక్రమణకు గురై, వర్షం పడిన ప్రతిసారి నీరు ఇక్కడ నిల్వ ఉండిపోయి, తద్వారా ఇక్కడి ప్రజలు జబ్బుల బారిన పడుతున్నారంటూ తన దృష్టికి వచ్చినప్పటికీ దీనికి ప్రధాన కారణం అయిన రోడ్డు ఆక్రమణలను తొలగించాలని ఎన్నిసార్లు ఇక్కడి వారికి విన్నవించుకున్న ఫలితం లేకపోయింది అన్నారు. దీనికి పరిష్కారం చేయడం కోసం ఈరోజు రెవిన్యూ, పోలీస్ అధికారులతో కలసి ఆయన సబ్బవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే తప్పనిసరిగా ప్రజల సహకారం ఉండాలని, ఈ రోడ్డు ఆక్రమణలను గుర్తించి వారం రోజులుగా వీటిని తొలగించి ఎస్టిమేషన్లను సిద్ధం చేసినట్లయితే అసెంబ్లీ జరుగుతున్న ఈ సమయంలో ముఖ్యమంత్రి లేదా సంబంధిత మంత్రితో మాట్లాడి త్వరితగతిన సబ్బవరం కూడలిలో ఇబ్బంది లేకుండా ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసే బాధ్యత తను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం అసకపల్లి నుండి లంకెలపాలెం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను పర్యవేక్షించారు. ఈ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ఒక కాలపరిమితి లోగా పూర్తి చేయాలని సంకల్పంతో ఉందన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో జీవీఎంసీ పెందుర్తి జోనల్ కమిషనర్ శంకర్రావు, 94 వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాస రావు, జీవీఎంసీ సూపర్డెంట్ ఇంజనీర్ శ్రీనివాస రావు, ఎం ఆర్ డి ఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ అరుణ వల్లి, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి రామలింగా రెడ్డి, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దిలీప్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్వత, మండల రెవెన్యూ అధికారి వెంకట అప్పారావు, సబ్బవరం మండల రెవెన్యూ అధికారి చిన్ని కృష్ణ, ఆర్ అండ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలరాజు, నేషనల్ హైవే అధికారి రిచర్డ్, మొదలగు జీవీఎంసీ, విఎంఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం, ఆర్ఎంపీ అధికారులు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, నేషనల్ హైవే అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో ప్రతిభను గుర్తించుట కొరకు శాప్ లీగ్ సెలక్షన్ నిర్వహణ





జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్


**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి16 :** జిల్లాలో క్రీడలను ప్రోత్సహించి, మంచి క్రీడాకారులను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ క్రీడా అబివృద్ధి అధికారిని ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి జిల్లా క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహించే శాప్ లీగ్ పోటీలలో ఎక్కువ క్రీడాకారులు పాల్గొనేలా చూడాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పూజారి శైలజ ని ఆదేశించటం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వారిచే నిర్వహించే క్రీడా గోడ పత్రికలను ఆవిష్కరణ చేయటం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పూజారి శైలజ, జెడ్పి సిఇఒ నారాయణ మూర్తి, డి పి ఒ. సందీప్, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి మంజుల వాణి, డ్వామా పీడీ పూర్ణిమా దేవి, యలమంచిలి, అనకాపల్లి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ నరసింహ, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కృష్ణ దేవరాయలు జయంతి వేడుకలు



**పెనుకొండ, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** పెనుకొండ పట్టణంలో శ్రీ కృష్ణ దేవరాయలు జయంతి వేడుకలు పెనుకొండ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా పెనుకొండ మార్కెట్ సమీపంలో గల శ్రీ కృష్ణ దేవరాయల విగ్రహానికి, అలాగే వై జంక్షన్ వద్ద ఉన్న శ్రీ కృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు జరిపారు. అనంతరం జయహో శ్రీ కృష్ణదేవరాయ నినాదాలు చేస్తూ ఆయన చేసిన చారిత్రాత్మక పనులను కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పెనుకొండను విజయనగర సామ్రాజ్యానికి రెండవ రాజధానిగా చేసిన ఘనత శ్రీ కృష్ణదేవరాయలదేనని పేర్కొన్నారు. ఆయన కాలంలో పెనుకొండలో త్రవ్వించిన చెరువులు ఈ రోజుకీ రైతులకు సాగునీరు, ప్రజలకు త్రాగునీరు అందిస్తూ ఆయన దూరదృష్టికి నిదర్శనంగా నిలిచాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ బలిజ సంఘం అధ్యక్షులు గుట్టూరు సూర్యనారాయణ, ప్రగతి శ్రీనివాసులు, పెనుకొండ తెదేపా అర్బన్ కన్వీనర్ శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, కౌన్సిలర్లు గిరి, హనుమంతు, బలిజ సంఘం కార్యనిర్వాహక సభ్యులు పులుగూర శ్రీనివాసులు, గోపికృష్ణ, రవి, బాలాజీ, మురళీ, బిజెపి రామాంజనేయులు, జనసేన శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఐదేళ్ళలో భారత్ లో కనుమరుగయ్యే ఉద్యోగాలు



**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 16:**ప్రపంచ వ్యాప్తంగా ఏఐ అన్ని రంగాలలోనూ శరవేగంగా తన సత్తాను చాటుతోంది. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో, విస్తరణతో ఉద్యోగాలు తగ్గిపోతాయి అనే భయం ఎప్పటినుంచో అందరిలోనూ ఉంది. అయితే తాజాగా అటువంటి ఆందోళనను ప్రముఖ బిలియనీర్, వెంచర్ క్యాపిటలిస్ట్ వినోద్ ఖోస్లా మరోసారి ప్రస్తావించారు. భారతదేశంలో త్వరలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ నేపథ్యంలో ఆయన ఒక జాతీయ మీడియాతో మాట్లాడుతూ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఆయన వచ్చే ఐదేళ్లలో కనుమరుగయ్యే ఉద్యోగాల గురించి షాకింగ్ వ్యాఖ్యలు చేశారు. రానున్న ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓలు దాదాపు కనుమరుగు కానున్నాయని ఖోస్లా అభిప్రాయం వ్యక్తం చేశారు. 15 ఏళ్ళలో ఆ వృత్తులు కనుమరుగు అలాగే, సుమారు 15 ఏళ్లలో నైపుణ్యఆధారిత వృత్తులు కూడా తుడిచిపెట్టుకుపోతాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆ ప్లేస్ ని రీప్లేస్ చేస్తుందని ఆయన హెచ్చరించారు. అయితే, ఈ పరిణామం వల్ల విద్య, వైద్య సేవలు అందరికీ మరింత అందుబాటు లోకి తీసుకురావడం సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల స్థానంలో రోబోలు వినోద్ ఖోస్లా మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పై భారీ ప్రభావాన్ని చూపించనుందన్నారు. ఆ ప్రభావం ఎక్కువగా ఉద్యోగాల పైనే ఉంటుంది. కార్మికుల స్థానంలో రోబోలు పనిచేస్తాయని, కార్మికుల కంటే రోబోలకు ఖర్చు చేసే వ్యయం చాలా తక్కువగా ఉండటంతో ద్రవ్యోల్బణం తగ్గుతుంది. ఇక ఇదే సమయంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. రానున్న 15 నుంచి 20 ఏళ్లలో చాలావరకు దేశంలో ప్రజలకు అందే సేవలు ఉచితం కావొచ్చు అన్నారు. విద్య, వైద్యం అందరికీ అందుబాటు లోకి వస్తుంది అని పేర్కొన్నారు. మనుషులు ఉద్యోగాల కోసం చదవడం, ప్రభుత్వాలు ఉద్యోగ కల్పన పై దృష్టి పెట్టడం భవిష్యత్తులో సరైన ఆలోచన కాకపోవచ్చని ఖోస్లా అభిప్రాయం వ్యక్తం చేశారు. పలు వృత్తులను ఏఐ మరింత మెరుగ్గా చేయగలదు. కాబట్టి ఏఐ, మనుషులు కలిసి పనిచేసే కాలం వస్తుందని తాను భావిస్తున్నట్టుగా తెలిపారు. ఇక భారత్ ఐటీ సేవల విషయంలో కాకుండా, ఏఐ ఆధారిత ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశంగా అవతరిస్తుంది అని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

# 18 వ తేదీన ముఖ్యమంత్రి విశాఖపట్నం రాక



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 16**: భారత నౌకాదళం విశాఖపట్నం కేంద్రం గా నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐ.ఎఫ్.ఆర్) కార్యక్రమంలో పాల్గొనుటకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 18 వ విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగా విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి నేవల్ జెట్టికి చేరుకొని భారత రాష్ట్రపతికి స్వాగత కార్యక్రమం అనంతరం ఐ.ఎఫ్.ఆర్.లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం గం.1:20 నిమిషాలకు విశాఖపట్నం ఐ. ఎన్. ఎస్. డేగా నుంచి బయలుదేరి ఉండవల్లి లో గల నివాసానికి చేరుకుంటారు.

# వైద్య సేవల పై జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సమీక్ష




**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** మాతా శిశు మరణాల నివారణ లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని అనకాపల్లి జిల్లా టాస్క్ ఫోర్స్ ప్రధాన అధికారిణి డా. జె.ప్రశాంతి ఆదేశించారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, బాలింత లలో రక్తహీనత లేకుండా చూడాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ బృందం లోని జిల్లా గణాంకాధికారి రామచందరావు, డిపిఓ జగదీశ్, జనార్ధన్ తో కూడిన బృందం హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఖాజీ పాలెం విలేజ్ హెల్త్ క్లినిక్ ను సందర్శించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఆర్ సి హెచ్ లో గర్భిణీ స్త్రీలు పిల్లల నమోదు లక్ష్యాన్ని సాధించాలని, చిన్న వయసులో గర్భిణీలు నమోదు అవ్వకుండా చూడాలని, గర్భిణీలలో హైరిస్క్ వారిని గుర్తించి తగిన చికిత్స అందేటట్లు చూడాలని, ప్రతి ఒక్కరికి అభ ఐడి అయ్యేటట్లు చూడాలని, సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల సర్వే జరుగుతున్న తీరును, గర్భిణీ,పిల్లల సేవలను ఆన్లైన్ పోర్టల్ లో నమోదైన వివరాలను పరిశీలించారు. విలేజి హెల్త్ క్లినిక్ లో క్షేత్రస్థాయి వైద్య రికార్డులు పరిశీలించి ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, సిబ్బంది నాగజ్యోతి, శశికళ, నాగ వరలక్ష్మి, ఆదిలక్ష్మి, జోత్స్న, నాగలక్ష్మి, గుణలక్ష్మి , పద్మ, జ్యోతి, లీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గేట్స్ ఫౌండేషన్ వర్చువల్ సమావేశంలో కలెక్టరు





**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 16 :** గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ అమరావతి పర్యటనలో భాగంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రులు, కార్యదర్సులతో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ బృందంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లు స్వర్ణాంధ్రఏ2047 విజన్ లో భాగంగా సంజీవని ప్రాజెక్ట్, కృత్రిమ మేధస్సు (ఏ.ఐ ) ఆధారిత వ్యవసాయం, విద్యా, ఆరోగ్య రంగాలలో చేపట్టిన ప్రాజెక్టుల పై మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు, గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బిల్ గేట్స్ తో కలిసి చర్చించారు. వివిధ శాఖల అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు ఈ చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్టీజిఎస్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను గురించి ముఖ్యమంత్రి బిల్ గేట్స్ కు తెలియజేసారు. ప్రాజెక్ట్ సంజీవని అమలుకు గేట్స్ ఫౌండేషన్ కృత్రిమ మేధస్సు (ఏ.ఐ) సాంకేతిక సహాయం అందించనున్నట్లు గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి వర్చువల్ గా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి. రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# మహా రుద్రాభిషేకం హోమం కార్యక్రమంలో అన్నంరెడ్డి

**పరవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీలో వెలిసిన ఉమ రామలింగేశ్వర స్వామి ఆలయం నందు మహా శివరాత్రి సందర్భంగా మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో సముద్ర తీరం నందు ఏర్పాటు చేసిన మహా రుద్రాభిషేకం హోమం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్, వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ పయిల సన్యాసిరాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గండి రవి కుమార్, పరవాడ మండల వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, పెదిశెట్టి పూజ శేఖర్, 85 వ వార్డ్ ఉప అధ్యక్షులు గెంజి సురేష్, వై.సి.పి నాయకులు దుడ దేముడు, మైలపల్లి జగన్, మండల ప్రధాన కార్యదర్శి స్పీడ్ మసేను, తదితరులు పాల్గొన్నారు.





# పుష్కరిణి అభివృద్ధికి ఏషియన్ పెయింట్స్ సి ఎస్ ఆర్ నిధులు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి పుష్కరణి ( బంధుర సరస్సు ) అభివృద్ధికి ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ ముందుకు వచ్చింది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సిఫారసు మేరకు ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు సోమవారం ఉపమాక ఆలయాన్ని సందర్శించారు. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి చిత్రపటంతో సత్కరించారు. అనంతరం ఏషియన్ పెయింట్ సంస్థ సి ఎస్ ఆర్ నిధులతో ఉప్మాక పుష్కరిణి అభివృద్ధి, పెద్ద చెరువుకు నీరు వచ్చే కాలువ పూడికతీత,వాకింగ్ ట్రాక్, చెరువు చుట్టూ సోలార్ లైట్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు మండల నాయకుల సమక్షంలో కంపెనీ ప్రతినిధులు పరిశీలన చేసారు. ఈ నిధులతో త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ కన్వీనర్ వెంకటేష్, మండల టిడిపి నాయకులు లక్ష్మణరావు, పిఎసిఎస్ చైర్ పర్సన్స్ కే బుజ్జి, శ్రీను, నాయకులు జగదీష్, తోలేటి శ్రీను తదితరులు ఉన్నారు.

# ఉపమాక వెంకన్న కల్యాణోత్సవ ప్రచార పత్రిక విడుదల



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఈనెల 27న జరిగే స్వామివారి వార్షిక కళ్యాణోత్సవ ప్రచార గోడపత్రికను కూటమి నాయకులు విడుదల చేశారు. సోమవారం స్వామివారి ఆలయం వద్ద ఉమ్మడి విశాఖ జిల్లా, విజయనగరం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలలో స్వామివారి కల్యాణ ఉత్సవాల ప్రచారాన్ని నిర్వహించేందుకు ఆటోలను ప్రారంభించారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు గోడ పత్రికలు, ప్రచార కరపత్రాలు, ప్రచార వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదచార్యులు మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని రకాల మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు,బుజ్జి, గింజాల లక్ష్మణరావు, వెలగా శ్రీనివాసరావు, జగదీష్, శ్రీను తదితరులు ఉన్నారు.

# మాఘమాస పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్తులు





**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** మాఘమాసం శివరాత్రి అమావాస్య సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సోమవారం రాజయ్యపేట శివారు బోయపాడు సముద్ర తీరంలో నియోజకవర్గ పరిధిలో వేలాదిమంది సముద్రంలో స్నానం ఆచరించారు. ప్రతి ఏటా మాఘ మాసంలో వచ్చే పౌర్ణమి, అమావాస్య రోజులలో భక్తులు సముద్రంలో పుణ్యా స్నానాలు ఆచరిస్తారు. శివరాత్రి జాగరణ చేసిన అనేకమంది పుణ్య స్థానాలకు రావడంతో తీర ప్రాంతం కిటకిటలాడింది. తీరానికి వెళ్లే దారిలో భారీగా వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. నక్కపల్లి సిఐ మురళి సముద్ర తీరం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. రాజయ్యపేటలో జరిగే నూకతాత పండగ సందర్భంగా మంగళవారం కూడా ఈ తీరంలో పుణ్యస్నానాలు చేస్తారని మత్స్యకారులు తెలిపారు.

# విశాఖలో 2 రోజుల పాటు టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ పండుగ

పోస్టర్ ను విడుదల చేసిన గంటా, వంశీ.





**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** మధురవాడ ఏసీఏ – వీడీసీఏ స్టేడియంలో ఈనెల 29, మార్చి 1 వ తేదీల్లో టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. హోటల్ మేఘాలయలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్ ఎమ్మెల్యే సీహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ తో కలిసి క్రికెట్ పోటీల వివరాలను ఆయన వెల్లడించారు. టాలీవుడ్ నటులు, టీవీ నటులతో రెండేసి టీంలు.. పోలీసులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులతో ఒక్కో టీం చొప్పున మొత్తం 7 టీంల నుంచి 110 సెలబ్రిటీలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ మ్యాచ్ ల ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద పిల్లల చదువు, సీఎం సహాయ నిధి, దాతృత్వ కార్యక్రమాలకు వినియోగిస్తారని పేర్కొన్నారు. విశాఖను అంతర్జాతీయ స్పోర్ట్స్ హబ్ గా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందన్నారు. కొమ్మాదిలో అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, దివ్యాంగుల ప్రత్యేక స్టేడియం అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బీసీసీఐ సహకారంతో మధురవాడ క్రికెట్ స్టేడియంలో వసతులు ఎంతగానో మెరుగు పరిచారని.. వన్డే, టీ20, ఐపీఎల్ మ్యాచ్ ల కేటాయింపులో విశాఖకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రెండు రోజుల పాటు అలరించనున్న సెలబ్రిటీ లీగ్ ను వీక్షించే అవకాశాన్ని విశాఖ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. భోగాపురం ఎయిర్ పోర్టు కార్యకలాపాలు మొదలైన తర్వాత విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, 7 మాస్టర్ ప్లాన్ కనెక్టింగ్ రోడ్లు ఈ ఏడాది జూన్ లోపు అందుబాటు లోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. సెలబ్రిటీ లీగ్ నిర్వాహకుడు రాంబాబు మాట్లాడుతూ క్రికెట్ పోటీల నిర్వహణలో వెన్నంటి ఉండి నడిపిస్తున్న ఎమ్మెల్యే గంటా సూచనతో ఉచిత ప్రవేశం కల్పించాలని నిర్ణయించామని తెలియజేశారు. ఐపీఎల్ తరహాలో సెలబ్రిటీ మ్యాచ్ లను డిజైన్ చేశామన్నారు. టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోస్టర్ ను ఈ సందర్భంగా విడుదల చేశారు. వ్యాపారవేత్తలు కంకటాల మల్లిక్, పైడా కృష్ణప్రసాద్, కాశీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఏడి ఫ్లైఓవర్ ప్రాజెక్టు పనులు శత శాతం పూర్తి.

నేటినుంచి ఆర్ఓబి అందుబాటు లోకి







**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 16:** విఏంఆర్డిఏ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఎన్ఏడి ఫ్లై ఓవర్ ప్రాజెక్టు లో అంతర్భాగ మైన రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) నిర్మాణం అన్ని విధాలా పూర్తి చేసి ఈరోజు విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ పి వి జి ఆర్ నాయుడు (గణ బాబు), విఏంఆర్డిఏ ఛైర్పర్సన్ ఎంవి ప్రణవ్ గోపాల్, శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ విశాఖపట్నానికి ముఖద్వారం అయినటువంటి ఎన్ఏడి జంక్షన్లో 2017 కు ముందు వరకు ట్రాఫిక్ సమస్యలు తక్కువగా ఉండేవి. కాలక్రమేణా వాహనాల సంఖ్య పెరగడం, ఇతర కారణాలతో ట్రాఫిక్ పెరగటం వలన సుమారు రూ 150 కోట్ల విఏంఆర్డిఏ నిధులతో ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని, ప్రస్తుతం విఏంఆర్డిఏ డైనమిక్ చైర్మన్, యువ ఐస్ అధికారి సారథ్యంలో ముందుకు సాగుతోందని అన్నారు. విఏంఆర్డిఏ ఛైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విఏంఆర్డిఏ పరిధి లోని శాసనసభ నియోజకవర్గాల్లో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని 2017 లో స్థానిక శాసనసభ్యులు గణబాబు తన దూరదృష్టితో ప్రతిపాదించిన ఈ ఎన్ఏడి ఫ్లై ఓవర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపి వారి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం, అదేవిధంగా ఈరోజు ప్రారంభించుకోవడం చాలా ఆనందంగా ఉందని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి కంపెనీల రాకతో రాబోయే రోజుల్లో విశాఖపట్నం రూపు రేఖలు అనూహ్యంగా మారబోతున్నాయన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ 2021 వ సంవత్సరంలో పనులు ప్రారంభించినప్పటికీ రైల్వే అనుమతులు రావటం ఆలస్యం వలన ప్రాజెక్ట్ ఆలస్యం జరిగిందని, నగర ప్రజలకు, అదేవిధంగా ఎయిర్పోర్ట్ కు రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఎటువంటి అవరోధములు లేకుండా సత్వరమే వారి గమ్యస్థానం చేరుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, కార్యదర్శి మురళీకృష్ణ, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదన రావు, కార్యనిర్వహక ఇంజనీర్లు దుర్గా ప్రసాద్, రామరాజు, జనసేన నాయకురాలు ఎ.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటోరియల్

# ఈ ఒప్పందంతో.. దేశ రైతాంగానికి ఉరే!

భారత్–అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం దేశ రాజకీయాల్లోనే కాకుండా వ్యవసాయ రంగంలోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. అమెరికా అధికార వర్గాలు దీన్ని తమ రైతులకు లాభదాయకమని పేర్కొనడంతో..ఈ ఒప్పందం రైతాంగానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. ఈ నేపథ్యంలో, ఈ వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం సైతం సర్వత్రా విమర్శలకు కారణమైంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, పలువురు ప్రతిపక్ష నేతలు ఈ వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి పరిశ్రమలకు సంబంధించిన ప్రయోజనాలను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా, మోడీ ప్రభుత్వం ఎవరి విజ్ఞప్తులను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఇప్పటికే మోడీ ప్రభుత్వ నిరంకుశపూరిత వైఖరికి నిరసనగా.. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా రైతు సంఘాలు సమ్మె నిర్వహించాయి.

ఈ ఒప్పందం మీద అమెరికా మంత్రి బ్రూక్ రోలిన్స్ మాట్లాడుతూ.. ఈ నిర్ణయం అమెరికా రైతులకు లాభదాయకమని అభివర్ణించారు.. కానీ, భారతీయ రైతులకు ఈ ఒప్పందం శరఘాతంలా మారిన విషయం ప్రధాని మోడీ ఆయన పరివారం ఎందుకు గుర్తించడం లేదో? కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అమెరికా సోయాబీన్ ఆయిల్, డిస్టిలర్స్ గ్రెయిన్స్‌కు భారత మార్కెట్ తలుపులు తెరవడం ద్వారా దేశీయ రైతును తన నేలపైనే పోటీ చేయలేని స్థితికి నెట్టివేస్తున్నారు. చౌక విదేశీ దిగుమతులు పాడి, పశుసంవర్ధక రంగాలను కూల్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తాయి. ‘పంట మనది – లాభం పరాయిది’ అనే దోపిడీ విధానాన్ని దేశంపై ప్రధాని మోడీ బలవంతంగా రుద్దుతున్నారు.. ఎంఎస్‌పీ హామీలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నేడు అంతర్జాతీయ డంపింగ్‌కు ద్వారాలు తెరిచి రైతును బలి చేస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.. రైతు రక్షణ ముసుగులో అమెరికా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నది. ఈ ఒప్పందం భారత ఆహార భద్రతను బలహీనపరిచే కుట్రనే.

దేశానికి సంబంధించిన ఇంతటి కీలక నిర్ణయం తీసుకునే ముందు... రాష్ట్రాలను సంప్రదించకపోవడం, పార్లమెంటులో చర్చ జరపకపోవడం, రైతు సంఘాల అభిప్రాయాన్ని లెక్కలోకి తీసుకోకపోవడం ప్రజాస్వామ్య విలువల స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించారు. ఇది రాజ్యాంగ విలువల్నీ పాతరేయడం కిందకు వస్తుంది. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి రైతుకు చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అసవరముంది. దేశాన్ని పోషించే రైతును బలి చేసి ఏ ప్రభుత్వం నిలబడలేదన్న విషయం మోడీ గుర్తించుకోవాలి. ఈ ఒప్పందం పాడి పరిశ్రమపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. అమెరికా నుండి పౌల్ట్రీ ఉత్పత్తులు, డిస్టిలర్స్ గ్రెయిన్స్ (పశువుల మేతగా వాడేవి) దిగుమతి అయితే, దేశీయ పశుగ్రాసం ధరలు పడిపోయతాయి. పాడి రైతులకు ఆదాయం తగ్గుతుంది. మన అవసరాలకు సరిపడా ఆహారాన్ని మనమే పండించుకోకుండా, దిగుమతులపై ఆధారపడితే.. భవిష్యత్తులో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. అందుకే రైతులు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, దానిని ఒక చట్టపరమైన హక్కుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న వ్యవసాయం గురించి కేంద్రం నిర్ణయాలు తీసుకునేటప్పుడు రాష్ట్రాలను సంప్రదించ కపోవడంపై ఆగ్రహం కల్పించడం జరుగుతున్నది. వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థల ప్రవేశం వల్ల రైతు కేవలం ఒక ‘కూలీ’గా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ఇలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల కేంద్ర–రాష్ట్రాల సయోధ్య పోతుంది. ఇంతటి కీలకమైన మార్కెట్ మార్పులపై పార్లమెంటులో చర్చ జరగకపోవడం వల్ల, భవిష్యత్తులో తలెత్తే లోటుపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండా పోతుంది. అమెరికా వంటి దేశాల్లో యాంత్రీకృత వ్యవసాయం వల్ల ఖర్చులు తక్కువ, కానీ భారత్‌లో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు.. వీరిద్దరి మధ్య పోటీ అనేది అసమానమైనది. ఈ విషయాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఒప్పందాన్ని వెనక్కి తీసుకొని... భారత రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# ఈ ఒక్క పని చేయండి చాలు ఈ సమస్యలన్నీ ఖతం



మనం సాధారణంగా నిమ్మరసాన్ని చల్లని నీటిలోనో లేదా సోడాలోనో కలుపుకుని తాగుతాం. అయితే ఆయుర్వేదం, ఆధునిక వైద్యం ప్రకారం, ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో నిమ్మరసం పిండుకుని తాగడం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. దీనిని శరీరానికి ఒక సంజీవనిలా పనిచేస్తుందని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు.. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారం తీసుకోవడం మంచిది.. అలాంటి ఆరోగ్యకరమైన విషయాల్లో ఈ అద్భుత పానీయం ఒకటి.. అదేంటో కాదు.. జస్ట్ 2 రూపాయలకు దొరికే నిమ్మకాయ.. అలాగే వేడి నీరు.. ప్రతిరోజూ ఉదయాన్నే వేడినీరు, నిమ్మరసం కలిపి తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మనం సాధారణంగా నిమ్మరసాన్ని చల్లని నీటిలోనో లేదా శీతల పానీయాలలోనో తాగుతాం. అయితే, ఆయుర్వేదం, ఆధునిక వైద్య నిపుణులు గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగమని సిఫార్సు చేస్తున్నారు. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక నిమ్మకాయను పూర్తిగా పిండుకొని తాగడం వల్ల అది మన శరీరానికి సంజీవనిలా పనిచేస్తుంది. డాక్టర్లు కూడా సిఫార్సు చేసే ఈ పానీయం వల్ల కలిగే తొమ్మిది అద్భుత ప్రయోజనాలు కలుగుతాయి. కొవ్వును కరిగిస్తుంది: మీరు బరువు తగ్గాలని చూస్తున్నట్లయితే, వేడి నిమ్మరసం ఉత్తమ పానీయం. నిమ్మరసంలోని ఔషధ గుణాలు శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వును కరిగించి, రక్త సరఫరాను మెరుగుపరుస్తాయి. దీనివల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. షుగర్ వ్యాధికి చెక్: మధుమేహం ఉన్నవారికి నిమ్మరసం ఎంతో మేలు చేస్తుంది. ఇది రక్తంలోని గ్లూకోస్ స్థాయిలను అదుపులో ఉంచి, షుగర్ లెవెల్స్ పెరగకుండా కాపాడుతుంది. వ్యర్థాల శుద్ధి: మనం పీల్చే గాలి, తినే ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్ళే విష పదార్థాలను బయటకు పంపడంలో వేడి నిమ్మరసం అద్భుతంగా పనిచేస్తుంది. ఇది మీ శరీరాన్ని లోపల నుండి శుభ్రం చేస్తుంది. రోగనిరోధక శక్తి పెంపు: నిమ్మరసంలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు సహజసిద్ధమైన యాంటీబయాటిక్‌గా పనిచేస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచి, వైరల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకుంటుంది. కిడ్నీలో రాళ్ల నుంచి ఉపశమనం: నిమ్మరసం తాగడం వల్ల శరీరంలో పొటాషియం, సిట్రేట్ స్థాయిలు పెరుగుతాయి. ఇది కిడ్నీలో పేరుకుపోయిన రాళ్లను నెమ్మదిగా కరిగించడానికి సహాయపడుతుంది. గాల్ బ్లాడర్ రాళ్లకు పరిష్కారం: కేవలం కిడ్నీలే కాదు, గాల్ బ్లాడర్ అంటే పిత్తాశయంలో రాళ్ల వల్ల వచ్చే కడుపునొప్పిని తగ్గించడంలో కూడా ఈ పానీయం తోడ్పడుతుంది. జీర్ణ సమస్యలకు పరిష్కారం: గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడేవారికి వేడి నిమ్మరసం ఒక వరం. ఇది జీర్ణ వ్యవస్థను చురుగ్గా ఉంచి, తిన్న ఆహారం త్వరగా అరిగేలా చేస్తుంది.మెరిసే చర్మం కోసం: చర్మంపై ముడతలు, మచ్చలు తగ్గి, చర్మం కోమలంగా, కాంతివంతంగా మారాలంటే నిమ్మరసం తాగాల్సిందే. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు చర్మానికి మంచి మెరుపునిస్తాయి. నొప్పులు ? వాపుల నుంచి ఉపశమనం: కీళ్లనొప్పులు, వాపులతో బాధపడేవారికి ఇది మంచి ఉపశమనాన్ని ఇస్తుంది.

అలాగే ఫ్లూ జ్వరం, దగ్గు, జలుబు వంటి సమస్యల నుండి కూడా త్వరగా కోలుకునేలా చేస్తుంది. ఇలా.. ఒక గ్లాసు వేడి నిమ్మరసం మీ శరీరంలో ఎన్ని అద్భుతాలు చేస్తుంది.. ఖరీదైన మందుల కంటే మన ఇంట్లో దొరికే ఈ సహజమైన పానీయం ఎంతో మేలు చేస్తుంది. ఇంకెందుకు ఆలస్యం ఉదయాన్ని ఒక గ్లాసు వేడి నిమ్మరసంతో మీ రోజును ప్రారంభించండి. నిమ్మరసం తాగిన తర్వాత పళ్ళ ఎనామిల్ దెబ్బతినకుండా ఉండడానికి సాధారణ నీటితో నోటిని పుక్కలించడం మంచిది.

# అధిక యూరిక్ యాసిడ్‌కు చెక్ పెట్టే బెస్ట్ ఫ్రూట్స్



ఈ మధ్య కాలంలో చాలా మంది హై యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్నారు. హై యూరిక్ యాసిడ్‌ను హైపర్ యూరిసెమియా అని కూడా పిలుస్తారు. ఈ సమస్య బారిన పడిన వారు కీళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలతో బాధపడుతుంటారు. రోజులు గడిచే కొద్దీ ఈ సమస్య అనేది తీవ్రతరం అవుతుంది. అందుకే ప్రారంభంలోనే ఈ సమస్యలకు చెక్ పెట్టాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా లైఫ్ స్టై?ల్ ఛేంజ్.. కొన్ని రకాల పండ్లు తీసుకోవడం వలన అధిక యూరిక్ యాసిడ్‌ను తగ్గించుకోవచ్చునంట.బెర్రీస్ : బెర్రీస్ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ముఖ్యంగా వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ సి, పాలీ ఫెనాల్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందువలన వీటిని మీరు మీ డైట్‌లో చేర్చుకోవడం వలన ఇవి సహజంగానే మీ శరీరంలోని అదనపు యూరిక్ యాసిడ్ తగ్గించడానికి ఉపయోగపడతాయి. ముఖ్యంగా బెర్రీస్‌లలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వలన ఇవి మూత్రం ద్వారా విషయాన్ని బయటకు పంపిస్తాయి. అందువలన తప్పకుండా వీటిని డైట్‌లో చేర్చుకోవాలంట. సిట్రస్ పండ్లు : సిట్రస్ జాతికి చెందిన పండ్లు యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. అందువలన నిమ్మ, నారిజ పండ్లను డైట్‌లో చేర్చుకోవడం వలన ఇవి మూత్ర పిండాల పనితీరును మెరుగు పరిచి, సహజంగానే శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను తగ్గించడానికి ఉపయోగపడుతాయి. ముఖ్యంగా ఉదయాన్నే పరగడుపున నిమ్మకాయ నీరు తాగడం లేదా, మధ్యాహ్నం లంచ్ తర్వాత నారింజ పండ్లు తినడం వలన అదనపు ప్రయోజనం చేకూరుతుంది.

అరటి పండ్లు : అరటి పండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అంతే కాకుండా చాలా మంది వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. అయితే ప్రతి రోజూ ఒక అరటి పండు తినడం వలన శక్తి లభించడమే కాకుండా శరీరంలోని అధిక యూరిక్ యాసిడ్ కూడా తగ్గుతుందంట. అరటిలో పొటాషియం ఎక్కువగా ఉండటం వలన ఇది మూత్రపిండాల పనితీరును మెరుగు పరుస్తుంది, అలాగే ఇందులోని ప్యూరిన్, యూరిక్ యాసిడ్ విచ్ఛిన్నం అయ్యేలా చేస్తుంది.చెర్రీస్ : చెర్రీస్ చాలా రుచిగా ఉండటమే కాకుండా ఇవి ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ముఖ్యంగా అధిక యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో ఆంథోసైనన్‌లు పుష్కలంగా ఉండటం వలన ఇది కీళ్ల నొప్పుల, కాళ్ల వాపులు వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. అలాగే, అదనపు యూరిక్ యాసిడ్‌ను తగ్గిస్తుంది. పైనాపిల్ :పైనాపిల్‌లో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది సహజ శోథ లక్షణాలు కలిగి ఉంటుంది. అందువలన అధిక యూరిక్ యాసిడ్‌తో బాధపడే వారు వీటిని ఆహారంలో చేర్చుకోవడం వలన కీళ్ల నొప్పుల వంటి సమస్యలు తగ్గిపోతాయి. అదే విధంగా, ఇవి మూత్రపిండాల ఆరోగ్యానికి చాలా మంచిది.

# చియా సీడ్స్, బీట్‌రూట్ జ్యూస్ శరీరంలో జరిగే మ్యాజిక్



బీట్‌రూట్, చియా విత్తనాల నీరు సమగ్ర ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది గుండె, మెదడు, చర్మం, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, శరీరానికి శక్తిని అందించడానికి, హైడ్రేటెడ్‌గా ఉంచడానికి సహాయపడుతుంది. విటమిన్ బి9, విటమిన్ సి, ఐరన్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్న ఈ పానీయం ఫిట్‌నెస్, జీవశక్తిని పెంచుతుంది. బీట్‌రూట్, చియా విత్తనాలతో తయారుచేసిన నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది గుండె, మెదడు, చర్మం, జీర్ణక్రియకు మంచిది. బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. మీరు ఫిట్‌గా మరియు శక్తివంతంగా ఉండాలనుకుంటే, ఈ ఆరోగ్యకరమైన పానీయాన్ని మీ ఆహారంలో చేర్చుకోండి. బీట్‌రూట్, చియా విత్తనాల నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. ఇందులో విటమిన్ బి9 (ఫోలేట్), విటమిన్ సి, ఐరన్, పొటాషియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. బీట్‌రూట్‌లో నైట్రేట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్త నాళాలను మెరుగుపరచడం ద్వారా, రక్త ప్రవాహాన్ని పెంచడం ద్వారా రక్తపోటును సాధారణీకరించడంలో సహాయపడతాయి. చియా గింజలు, బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల శక్తి పెరుగుతుంది. మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుతుంది. బీట్‌రూట్‌లో నైట్రేట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరుస్తాయి. దీనిని తీసుకోవడం వల్ల స్టామినా పెరుగుతుంది. బలహీనత, అలసట తొలగిపోతాయి. చియా గింజలు అధిక ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థం కారణంగా శక్తిని సజావుగా విడుదల చేస్తాయి. మరోవైపు, చియా విత్తనాలలో ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి వాపును నియంత్రిస్తాయి. ఇది ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బ్రెయిన్ ఫంక్షన్ మెరుగుపడి మెమరీ పెరుగుతుంది. శరీరం ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంటుంది.. అందమైన చర్మం, జుట్టు అందిస్తుంది. రక్తం పెరుగుదలకు సహాయపడుతుం ది..చియా గింజలు, బీట్‌రూట్ రసం ప్రతిరోజూ తీసుకోవడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. బీట్‌రూట్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, బీటాలైన్‌లు ఆక్సీకరణ ఒత్తిడిని నియంత్రించడంలో, చర్మపు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దీనిని తీసుకోవడం వల్ల రంగు మెరుగుపడుతుంది. కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే చియా గింజలు చర్మాన్ని హైడ్రేట్ చేస్తాయి. చర్మంలో స్థితిస్థాపకతను కాపాడుకోవడంలో సహాయపడతాయి. బీట్‌రూట్ కాలేయాన్ని నిర్విషీకరణ చేయడంలో, కాలేయం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, బీటైన్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

# అక్కడ మెరుపుల్లేవ్



టీ20 అనగానే గుర్తొచ్చేది సిక్సర్లు, ఫోర్లే! ఎంత బాదితే అభిమానులకు అంత ఆనందం. ఈసారి టీ20 ప్రపంచకప్‌లో చాలా మ్యాచ్‌ల్లో బ్యాటర్లు అదరగొడుతున్నారు. సిక్సర్లతో హోరెత్తిస్తున్నారు. కానీ ఆ మైదానానికి వస్తే బ్యాట్‌లు మూగబోతున్నాయి. బంతులు గర్జిస్తున్నాయి. ఆ మైదానమే.. ప్రేమదాస. కొలంబోలోని ఈ వేదిక ఇప్పుడు బ్యాటర్లకు సవాల్ విసురుతోంది. తాజాగా భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచే ఇందుకు ఉదాహరణ. పాక్ జట్టు ఆరుగురు స్పిన్నర్లను దింపితే.. భారత్ అయిదుగురితో వేయించింది. మొత్తంగా భారత్ ఇన్నింగ్స్‌లో పాక్ 18 ఓవర్లు స్లో బౌలర్లతోనే బౌలింగ్ చేయించింది.

ఉపఖండం అంటేనే బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు గుర్తుకొస్తాయి. మ్యాచ్ గడుస్తున్నకొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపిస్తారు. కానీ తొలి ఓవర్ నుంచే స్లో బౌలర్లు రంగంలోకి దిగుతున్నారంటేనే ప్రేమదాస పిచ్‌పై బంతి ఎలా నాట్యం చేస్తోందో అర్థం చేసుకోవచ్చు. బంతి బ్యాట్ మీదకు రాదు.. స్లాట్‌లో పడదు. భారీ షాట్లకు దొరకదు. సాంకేతికంగా బలంగా ఉండే బ్యాటర్లే ఇక్కడ నిలవగలుగుతారు. ఇప్పటిదాకా ఈ స్టేడియంలో నాలుగు మ్యాచ్‌లు జరిగితే ఒక్కసారి మాత్రమే స్కోరు 180 పరుగులు దాటింది. అది కూడా ఐర్లాండ్‌పై ఆస్ట్రేలియా కొట్టింది. అదే ఆస్ట్రేలియా.. జింబాబ్వే చేతిలో కంగుతిన్న మైదానం కూడా ఇదే. 170 ఛేదించలేక కంగారూ జట్టు 146 పరుగులకే చేతులెత్తేసింది. ఐర్లాండ్ కూడా శ్రీలంకకు గట్టిపోటీ ఇచ్చింది. ఒత్తిడికి తలొగ్గి ఓడిపోయింది. ఇక భారత్-పాకిస్థాన్‌తో మ్యాచ్ గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. బంతి ఎలా పడి ఎలా తిరుగుందో అర్థం కాని పరిస్థితుల్లో బ్యాటర్లు అయోమయానికి గురయ్యారు.

తొలి ఓవర్లోనే భారత్ అభిషేక్ శర్మ వికెట్ కోల్పోయి ఆత్మరక్షణలో పడింది. కానీ ఇషాన్ కిషన్ రూపంలో తెగించి భిన్నమైన షాట్లు ఆడే బ్యాటర్ ఉండడంతో టీమ్‌ఇండియాకు కలిసొచ్చింది. ఇషాన్ ఔటయ్యాక.. మిగిలిన భారత బ్యాటర్లు చాలా కష్టపడ్డారు. సూర్య, శివమ్ దూబె లాంటి దూకుడుగా ఆడే బ్యాటర్లు క్రీజులో ఉన్నా.. ఇషాన్ మాదిరిగా బ్యాట్ ఝుళిపించలేకపోయారు. బంతిని వీలైనంత నెమ్మదిగా వదులుతూ పాక్ బౌలర్లు.. భారత బ్యాటర్లకు కళ్లెం వేశారు. ఆ తర్వాత పాక్‌ను భారత బౌలర్లు క్రీజులో నాట్యం ఆడించారు. ఏమాత్రం కుదురుకోనీయని విధంగా బంతులు వేశారు. ఫుల్ లెంగ్త్‌లో కాకుండా.. బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బంతులతో పాక్ బ్యాటర్లకు పరీక్ష పెట్టారు.

బంతి పడకుండానే షాట్లు ఆడదామని ప్రయత్నించిన ప్రత్యర్థి బ్యాటర్లు పెవిలియన్ చేరక తప్పలేదు. ఇక్కడ జరిగిన గత నాలుగు మ్యాచ్‌ల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టే విజయాన్ని సాధించింది. టీ20ల్లో 160లోపు స్కోర్లు సాధించినా.. కాపాడుకోగలగడం మామూలు విషయం కాదు. కానీ ప్రేమదాస పిచ్‌పై ఇలాంటి స్కోర్లే పెద్ద స్కోర్లనడానికి ఇప్పటిదాకా జరిగిన మ్యాచ్‌లే నిదర్శనం. ఇకపై ప్రేమదాస స్టేడియంలో జరిగే మ్యాచ్‌లు ఎలా సాగుతాయోనన్న ఆసక్తి రేగుతోంది. గురువారం శ్రీలంక-జింబాబ్వే లీగ్ మ్యాచ్‌తో పాటు మూడు సూపర్-8 సమరాలకు ప్రేమదాస ఆతిథ్యం ఇవ్వనుంది.

# కంగారూలు మళ్లీ పడ్డారు



లంకేయులు అదరహో.. కంగారూలకు మళ్లీ షాక్! శ్రీలంక వరుసగా మూడో విజయంతో టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 8కు దూసుకెళ్లింది. జింబాబ్వే చేతిలో షాక్ తిన్న ఆస్ట్రేలియా.. లంక చేతిలోనూ ఓటమి పాలైంది. ఓపెనర్ నిశాంక (100 నాటౌట్; 52 బంతుల్లో 10ఐ4, 5ఐ6) అద్భుత శతకం సాధించిన వేళ.. గ్రూప్-బి మ్యాచ్‌లో శ్రీలంక 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తుగా ఓడించింది. సోమవారం మొదట ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (54; 27 బంతుల్లో 8ఐ4, 2ఐ6), ట్రావిస్ హెడ్ (56; 29 బంతుల్లో 7ఐ4, 3ఐ6) చెలరేగారు. కంగారూలు చాలా పెద్ద స్కోరు చేయాల్సింది. కానీ శ్రీలంక బౌలర్లు అద్భుతంగా పుంజుకుని ఆ జట్టును కట్టడి చేశారు. హేమంత (3/37), చమీర (2/36), వెల్లలాగె (1/33) ఆసీస్‌ను దెబ్బతీశారు. నిశాంకతో పాటు కుశాల్ మెండిస్ (51; 38 బంతుల్లో 6ఐ4, 1ఐ6), రత్నాయకే (28 నాటౌట్; 15 బంతుల్లో 6ఐ4) చెలరేగడంతో లక్ష్యాన్ని లంక 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఆసీస్ బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. నిశాంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియాకు ఇది రెండో ఓటమి. గత మ్యాచ్‌లో ఆ జట్టుకు జింబాబ్వే షాకిచ్చిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో ఆసీస్ సూపర్ 8 అవకాశాలు చాలా సంక్లిష్టమయ్యాయి. ఇప్పటికీ అవకాశాలు ఉన్నాయి. కానీ ఆ జట్టుకు సమీకరణాలు చాలా కలిసి రావాలి. ముందైతే మంగళవారం జరిగే మ్యాచ్‌లో ఐర్లాండ్ చేతిలో జింబాబ్వే ఓడిపోవాలి. ఆ మ్యాచ్‌లో జింబాబ్వే నెగ్గితే మాత్రం ఈ ప్రపంచ కప్‌లో ఆసీస్ కథ ముగుస్తుంది. జింబాబ్వే ముందంజ వేస్తుంది.

**దంచేశారు..:** శ్రీలంక ఛేదనలో ఓపెనర్ నిశాంకే హీరో. అతడు ఒంటి చేత్తో తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. విధ్వంసక విన్యాసాలతో లంక అభిమానులను ఉర్రూతలూగించాడు. రెండో ఓవర్లోనే మరో ఓపెనర్ కుశాల్ పెరీరా (1)ను వెనక్కి పంపినా.. ఆసీస్‌కు ఆ ఆనందం ఎంతో సేపు నిలువలేదు. నిశాంక విరుచుకుపడ్డాడు. చకచకా బౌండరీలు బాదేశాడు. కుశాల్ మెండిస్ కూడా చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కుశాల్ 35 బంతుల్లో, నిశాంక 32 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. అయితే 13వ ఓవర్లో కుశాల్ నిష్క్రమించడంతో 97 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అప్పటికి లంక స్కోరు 105. అక్కడి నుంచి నిశాంక మరింత రెచ్చిపోయాడు. రత్నాయకే కూడా అలవోకగా బ్యాట్ ఝుళిపించడంతో లంక వడివడిగా లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. బౌండరీల వరద పారుతుంటే ఆసీస్ బౌలర్లు నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఎలిస్ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన నిశాంక.. వెంటనే జంపా బౌలింగ్‌లో రెండు ఫోర్లు బాదేశాడు. ఓ సింగిల్‌తో శతకం పూర్తి చేశాడు. అర్ధశతకం నుంచి సెంచరీకి చేరుకోవడానికి అతడు 20 బంతులే ఆడడం విశేషం. రత్నాయకే బౌండరీతో శ్రీలంక లక్ష్యాన్ని అందుకుంది.

**హెడ్, మార్ష్ మెరిసినా..:** అంతకుముందు ఓ అద్భుత ఆరంభాన్ని ఆస్ట్రేలియా వృథా చేసుకుంది. భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 8.2 ఓవర్లలోనే 104/0తో కొండంత స్కోరు చేసేలా కనిపించిన ఆసీస్.. చివరికి 181తో సరిపెట్టుకోవడం ఏమాత్రం ఊహించనిదే. ఆస్ట్రేలియా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్లు మార్ష్ , ట్రావిస్ హెడ్‌లు లంక బౌలింగ్‌ను ఉతికేశారు. పోటీపడి బౌండరీలు బాదేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. కళ్లు చెదిరే సిక్స్‌లూ దంచారు. మార్ష్ రెండు ఫోర్లు, హెడ్ ఓ సిక్స్ కొట్టడంతో ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే చమీర 16 పరుగులు సమర్పించుకున్నాడు. తీక్షణ ఓవర్లో మార్ష్ వరుసగా 4, 4, 4, 4, 4 దంచేయడం విశేషం.

## వైట్ డ్రెస్‌లో ఫారియా మాయ




# శివం శైవం మూవీ టీజర్ రిలీజ్

- ఎంపీ పురంధేశ్వరి చేతుల మీదుగా ఆవిష్కరణ
- దర్శకుడు శ్రీనివాస్ కు ప్రశంసలు

సినిమా: భారత పార్లమెంటు సభ్యురాలు, 14 వ లోక్‌సభలో బాపట్ల నియోజకవర్గం నుంచి ఎన్నికైన దగ్గుబాటి పురంధేశ్వరి చేతులమీదుగా శివం శైవం -- ది 1989 ఫైల్ కేస్ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్ ఘనంగా ఆవిష్కరించబడింది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు రాజకీయ వారసత్వం అనుభవం కలిగిన ప్రముఖ నాయకురాలు పురంధేశ్వరి చేతులమీదుగా ఈ కార్యక్రమం జరగడం చిత్ర బృందానికి విశేషంగా నిలిచింది. మహా శివరాత్రి పర్వదినాన ఆధ్యాత్మిక వాతావరణంలో, మాంగో మ్యూజిక్ ఛానల్ వేదికగా సోమవారం ఈ వేడుక వైభవంగా నిర్వహించారు. దర్శకుడు సాయి శ్రీనివాస్ ఎంకే మాట్లాడుతూ, ఇది దేవుడి పేరుతో జరిగిన హత్యల కథ. నిజ సంఘటనల స్ఫూర్తితో రూపొందించిన ఈ చిత్రం కర్మ, నమ్మకం, నేరం చుట్టూ తిరిగే గ్రామీణ నేపథ్యం లోని లోతైన సంఘర్షణను చూపిస్తుంది. పూర్తిగా ఒకే గ్రామంలో సాగే ఈ కథ ప్రేక్షకులకు ఉత్కంఠభరిత మైన అనుభూతిని ఇస్తుంది అన్నారు. కథ, కథనం, దర్శకత్వ బాధ్యతలను ఆయనే నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో హీరోగా దినేష్ కుమార్, హీరోయిన్‌గా అన్ను పొన్నెన్, రెండో హీరోగా జయంత్, ప్రతినాయకుడి పాత్రలో రాజశేఖర్, హీరో బాల్యపాత్రలో అల్లూరి అనికేత్ నటిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంతో గ్రామీణ వాతావరణంలో తెరకెక్కిన ఈ చిత్రం 2026లో థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇది కేవలం సినిమా మాత్రమే కాదు, గ్రామీణ జీవితంలో దాగి ఉన్న భయం, నమ్మకం, నేరం వెనుక ఉన్న అసలు నిజాన్ని ప్రశ్నించే కథ" అని దర్శకుడు పేర్కొన్నారు. ప్రతి ఫ్రేమ్‌లో నిజాయితీ, ప్రతి సన్నివేశంలో ఉత్కంఠ, ప్రతి మలుపులో ఆశ్చర్యం నింపే విభిన్నమైన విలేజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గ్రామీణ నేపథ్యాన్ని కొత్త కోణంలో ఆవిష్కరిస్తూ, కథా కథన పరంగా ప్రేక్షకులను కట్టిపడేసే చిత్రంగా "శివం శైవం -- ది 1989 ఫైల్ కేస్" నిలుస్తుందని చిత్ర బృందం ఆశాభావం వ్యక్తం చేసింది. ఫస్ట్ లుక్, టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని, తమ అభిప్రాయాలను కామెంట్స్ రూపంలో తెలియజేయాలని చిత్ర బృందం కోరింది.






PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com